News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 02 | సంచిక :158 | ఖమ్మం | శుక్రవారం, జూలై 26, 2024 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad


తెలంగాణ ఆవిర్భావం తర్వాత గత దశాబ్ద కాలంలో రాష్ట్రం ఆశించినంత పురోభివృద్ధి సాధించలేదు. పైగా సంక్షేమం సన్నగిల్లింది. రాష్ట్రం అప్పులపాలైంది. చినికిచినికి గాలివానలా పదేళ్లలో రాష్ట్ర రుణం దాదాపు పదిరెట్లు పెరిగింది. నాటి పాలకుల తప్పుడు విధాన నిర్ణయాల కారణంగా సాగునీటి ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయాయి. కాల్వల ద్వారా నీటికి బదులు అవినీతి సొమ్మును ప్రవహింపజేయాలనే లక్ష్యంతోనే గత ప్రభుత్వం పనిచేసింది. అపరిష్కృత సాగునీటి సమస్యలు పరిష్కరించడంతోపాటు దిద్దుబాటు చర్యలతో మేలైన ప్రాజెక్టులను నిర్మించాలనే కృతనిశ్చయంతో ఈ ప్రభుత్వం ఉంది.

-బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క


వ్యవసాయానికి రూ.72,659 కోట్లు



# సేద్యానికి పండగ...
# సంక్షేమం నిండుగా..





- ప్రధాన మంత్రి ఫసల్ బీమాలో చేరుతాం
- 33 రకాల సన్న వడ్లకు రూ. 500 బోనస్
- ఈ ఏడాది నుంచే రైతు కూలీలకు రూ. 12 వేలు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



- వివిధ సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగానికి రూ.1.10 లక్షల కోట్ల కేటాయింపు
- ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాల సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట
- ఆరు గ్యారంటీలకు రూ.47,167 కోట్లు..
- గ్రేటర్ హైదరాబాద్ నగర అభివృద్ధికీ ప్రాధాన్యం
- రాష్ట్ర ఆదాయం పెంపుపై దృష్టి
- పన్నుల రాబడి 24% పెరుగుతుందని బడ్జెట్ అంచనా

వివరాలు 2లో..

## గనులు, ఖనిజ భూములపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలదే

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు




దిల్లీ: ఖనిజ భూములు, గనులపై లీజుదారుడు చెల్లించే రాయల్టీని పన్నుగా పరిగణించకూడదని సుప్రీంకోర్టు రాజ్యాంగధర్మాసనం కీలక తీర్పునిచ్చింది. 35 ఏళ్లుగా ఈ అంశంపై కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య రగులుతున్న వివాదానికి గురువారం ముగింపు

వివరాలు 2లో..

## అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్రారంభం

మిగిలిన 4 వేల ఎకరాల సమీకరణే లక్ష్యం

రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరడం, అమరావతి పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అగ్రప్రాధాన్యం



వివరాలు 2లో..

# ఎమర్జెన్సీని మించిన అరాచకం

- వైకాపా పాలనలో అందరూ బాధలు పడ్డవారే
- పోలీసుల్ని అడ్డుపెట్టుకుని అన్ని వ్యవస్థలపై దాడులు
- నేరస్థుడు ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో చూశాం
- శాసనసభలో ధ్వజమెత్తిన సీఎం చంద్రబాబు
- జగన్ పాలనలో క్షీణించిన శాంతిభద్రతలపై శ్వేతపత్రం
- బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టిన అధికారుల్ని శిక్షిస్తాం
- అమరావతి రైతులపై పెట్టిన కేసులు సమీక్షిస్తాం
- సీపీఎస్ ఉద్యోగులపై కేసులు ఎత్తేస్తామని హామీ



సీకే న్యూస్ హైదరాబాద్ : 'దేశంలో ఎమర్జెన్సీ సమయంలోనూ కొంతమందే బాధితులుగా ఉండి ఉంటారేమో.. కానీ గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదం బారిన పడ్డారు. శారీరకంగా, మానసికంగా ఎన్నెన్నో బాధలు అనుభవించారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. కొందరు పోలీసు అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్య పునాదులైన శాసన, కార్యనిర్వాహక, న్యాయ, మీడియా వ్యవస్థలపై దాడులు చేశారని విమర్శించారు. ఒక నేరస్థుడు ముఖ్యమంత్రిగా ఉంటే ఏం జరుగుతుందో రాష్ట్రంలో గత ఐదేళ్లలో కళ్లారా చూశామని తెలిపారు. దాడులు, అత్యాచారాలు, దారుణాలు, అకృత్యాలు జరుగుతుంటే ముఖ్యమంత్రిగా ఉంటూ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని ఏ ఒక్క రోజైనా ఖండించారా? శాంతిభద్రతలపై సమీక్షించారా అని నిలదీశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించిపోయాయంటూ దిల్లీ వెళ్లి ధర్నా చేయటం దారుణమని మండిపడ్డారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై చంద్రబాబు గురువారం శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన దాడులు, దౌర్జన్యాలు, నేరాలు, గంజాయి వ్యాప్తి తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అప్పుడు శాంతిభద్రతలు గుర్తుకురాలేదా జగన్? వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు ఆయన వద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను చంపేసి.. మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసినప్పుడు శాంతిభద్రతలు ఏమైపోయాయి? ఆయన జైలు నుంచి విడుదలైతే భారీ ఊరేగింపుగా తీసుకెళ్లినప్పుడు శాంతిభద్రతలు ఎక్కడున్నాయి? జగన్ ఇంటికి సమీపంలో కృష్ణా నదీ తీరంలో దళిత యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. గుంటూరు జిల్లాలో దుండగులు ఓ వ్యక్తిని తాళ్లతో కట్టేసి.. కళ్ల ముందే అతని భార్యపై సామూహిక అత్యాచారం చేశారు. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్

వివరాలు 2లో..



## అన్ని వర్గాలకూ మోసం

ఇది రైతు శత్రు ప్రభుత్వం
వాస్తవానికి దూరంగా బడ్జెట్
రాష్ట్ర ప్రభుత్వంపై కేసీఆర్ ధ్వజం
ఎన్నికల తర్వాత అసెంబ్లీలోకి తొలిసారి

సీకే న్యూస్ హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వ ర్గాలనూ మోసం చేసిందని, అందర్నీ వెన్నుపోటు పొడిచిందని భారాస అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. బడ్జెట్‌ను చూస్తుం టే ఇది రైతు శత్రు ప్రభుత్వంగా తేలిపోయిందని మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై నిర్దిష్టమైన విధానం

వివరాలు 2లో..

## ఆర్థిక స్థితి సంక్లిష్టం.. అయినా సంక్షేమాన్ని విస్మరించం



- గత ప్రభుత్వ హయాంలో సంక్షేమం సన్నగిల్లి.. అభివృద్ధి అడుగంటి.. రాష్ట్రం అప్పులపాలైంది
- వ్యవస్థను గాడిలో పెట్టడమే మేం ఎదుర్కొన్న పెనుసవాల్
- ఇందిరమ్మ రాజ్యస్థాపన వాగ్దానాన్ని నెరవేరుస్తాం
- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

వివరాలు 2లో..

## వెల్లువలా పెద్దిరెడ్డి భూ బాధితులు

వందల సంఖ్యలో తరలివచ్చిన వంచితులు
న్యాయం చేయాలంటూ ప్రత్యేక సీఎస్ సిసోదియాకు మొర
ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపడతామని హామీ

సీకే న్యూస్ హైదరాబాద్ : అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి గురువారం భూ బాధితులు పోటెత్తారు. వైకాపా హయాంలో జరిగిన కబ్జాలు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు సాగించిన దందాలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



వివరాలు 2లో..



## నేడు ఢిల్లీకి ఏపీ సీఎం చంద్రబాబు

- రేపు ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశం
- నేడు రాత్రి 8 గంటలకు ఢిల్లీ చేరుకోనున్న చంద్రబాబు
- పోలవరం అంశాన్ని నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావించనున్న ఏపీ సీఎం

వివరాలు 2లో..

# సేద్యానికి పండగ.. సంక్షేమం నిండుగా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో పేదల సంక్షేమం, సేద్యానికి అగ్రతాంబూలం ఇచ్చింది. రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌లో సంక్షేమం, వ్యవసాయ రంగాలకే రూ.1.10 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించి తమ ప్రాథమ్యాలను చాటింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాల సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసింది. మొత్తంగా సంక్షేమం, సాగు రంగాలే గుండెగా 2024–25 బడ్జెట్‌ను గురువారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమ పథకాలకు రూ.63 వేల కోట్లు కేటాయించడం ద్వారా సబ్బండ వర్గాల సంక్షేమం, అభివృద్ధే తమ లక్ష్యమని ప్రభుత్వం వివరించింది. ఇక ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన భరోసా ప్రకారం వ్యవసాయ రంగానికి భారీగా నిధులు కేటాయించింది. ఆరు గ్యారంటీల అమలుకు నిధుల కేటాయింపునూ సర్కారు ప్రాధాన్య అంశంగా చేపట్టింది. వీటికే ప్రత్యేకంగా రూ.47,167 కోట్లను ఇవ్వడం ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ఆదాయానికి కీలకమైన గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపైనా శ్రద్ధ చూపుతూ రూ.10 వేల కోట్లను ప్రత్యేకించింది. అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రధాన పథకాలకు నిధులు పెద్దమొత్తంలో దక్కాయి. రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త పాలసీలు తీసుకురానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతి గ్రామం నుంచి మండలానికి, అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు 4 వరసల తారురోడ్లు నిర్మించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు వివరించింది. మొత్తం అన్ని పథకాలకు కలిపి రూ.లక్షా 55 వేల కోట్లకుపైగా కేటాయించింది. ఈ పథకాల ద్వారా పేదలకు అధిక లబ్ధి చేకూరడమే కాకుండా అభివృద్ధి పరుగులు తీస్తుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

**వనరుల పరిమితులున్నా..**

వనరుల పరిమితులున్నా.. రాష్ట్ర ఆదాయం రూ.2.90 లక్షల కోట్లకుపైగా సాధించాలని ప్రభుత్వం బడ్జెట్‌లో లక్ష్యాన్ని పెట్టుకుంది. ఈ రాబడి లక్ష్యసాధనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అన్ని పథకాలకు కలిపి రూ.2.91 లక్షల కోట్లకు పైగా ఖర్చుచేయాలని నిర్ణయించింది. గతేడాది శాసనసభ, పార్లమెంటు ఎన్నికలున్నందున యంత్రాంగం దాదాపు ఐదారు నెలలు ఎన్నికల ప్రక్రియపై దృష్టి పెట్టడంతో ఆదాయం పెద్దగా పెరగలేదని ఆర్థికశాఖ వివరించింది. సాధారణంగా ఒక ఏడాది ఆదాయం పెద్దగా పెరగకపోతే.. మరుసటి సంవత్సరం భారీగా పెరగడం సహజమని అందుకే ఈ ఏడాది పన్నుల ద్వారా ఆదాయంలో 24 శాతానికిపైగా వృద్ధిరేటు నమోదవుతుందని ఈ శాఖ ధీమా వ్యక్తం చేస్తోంది. 2022–23లో పన్నుల ద్వారా రూ.లక్షా 6 వేల కోట్ల ఆదాయం రాగా.. గతేడాది(2023–24) బడ్జెట్‌లో తొలుత రూ.లక్షా 31 వేల కోట్లు దాటవచ్చని గత ప్రభుత్వం అంచనా వేసింది. కానీ, ఎన్నికల హడావుడి కారణంగా ఆదాయం పెంపుపై దృష్టి పెట్టే అవకాశం యంత్రాంగానికి లేకపోవడంతో చివరికి రూ.లక్షా 11 వేల కోట్లే వచ్చినట్లు 'సవరణ బడ్జెట్' తెలిపింది. ఈ సవరణ మొత్తంపై మరో 24 శాతం పెరిగి ఈ ఏడాది రూ.లక్షా 38 వేల కోట్లు రావచ్చని తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. గతేడాది పన్నుల ద్వారా ఆదాయం వృద్ధిరేటు తక్కువగా ఉండటానికి ఎన్నికలే కారణమని, ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండదని, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో వారం వారం సమీక్షలు జరిపి సంస్కరణలు తెస్తున్నందున 24 శాతం వృద్ధి సాధిస్తామని ధీమా వ్యక్తంచేసింది. ఇక పన్నేతర ఆదాయం గతేడాది రూ.23,819 కోట్లు రాగా ఈ ఏడాది రూ.35,208 కోట్లు వస్తుందని అంచనా వేసింది. రాష్ట్ర రెవెన్యూ రాబడి పద్దు కింద వచ్చే మొత్తం రూ.2.21 లక్షల కోట్లలో... పన్నుల ద్వారా ఆదాయం రూ.1.38 లక్షల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208 కోట్లు అత్యంత కీలకం. సంక్షేమ పథకాలకు ఈ నిధులు కీలకంగా మారనున్నాయి. ఇక మద్యంపై 'ఎక్సైజ్ సుంకం' పద్దు కింద వచ్చే ఆదాయం గతేడాదితో పోలిస్తే రూ.20,298 కోట్ల నుంచి రూ.25,617 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. మద్యం అమ్మకాలు భారీగా పెరిగేతేనే అదనంగా మరో రూ.5,319 కోట్ల ఆదాయం 'ఎక్సైజ్ సుంకం'గా వస్తుంది. మద్యం, పెట్రోలు, డీజిల్ అమ్మకాలు పెరిగితే వ్యాట్ కూడా రూ.33,449 కోట్లు వస్తుందని అంచనా.

**కేంద్రం నుంచి వచ్చేనా...**

రాష్ట్ర రెవెన్యూ రాబడిలో మరో కీలక పద్దు కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు. కేంద్రం అమలుచేసే పలు 'కేంద్ర ప్రాయోజిత పథకాల'(సీఎస్ఎస్) కింద గతేడాది రూ.41 వేల కోట్లు వస్తాయనుకుంటే చివరికి రూ.9,729.91 కోట్లే విడుదలయ్యాయి. దీంతో ఈ ఏడాది ఈ పద్దు మొత్తాన్ని తగ్గించి రూ.21,636.15 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేశారు. కానీ, కేంద్రం నుంచి గత మూడేళ్లలో.. ఏ ఒక్క ఏడాదిలో ఈ స్థాయిలో నిధులు రాలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇక మిగిలిన 8 నెలల్లో రూ.21,636.15 కోట్లు కేంద్రం విడుదల చేస్తేనే బడ్జెట్ ఆదాయ, అంచనా వ్యయాల లక్ష్యాలు నెరవేరతాయి.

**'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని మహాకవి దాశరథి చెప్పిన తెలంగాణను సాకారం చేసిన సోనియాగాంధీ ఆశీస్సులతో, కాంగ్రెస్ ప్రభుత్వం తొలి పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను.**
**- బడ్జెట్ ప్రసంగ సందర్భంగా భట్టి విక్రమార్క**

**అప్పులే ఆదుకునేది...**

రాష్ట్ర ఆదాయం పద్దులో అప్పులు అత్యంత కీలకంగా మారాయి. అప్పులను కూడా 'రాష్ట్ర ఆదాయం' పేరుతో బడ్జెట్‌లో చూపుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25)లో రూ.62,212 కోట్ల రుణాలను సేకరిస్తామని బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వీటితో కలిపితేనే రాష్ట్ర ఆదాయం రూ.2.90 లక్షల కోట్లు దాటుతుందని వివరించింది. గతేడాది(2023–24) రూ.51,566 కోట్ల రుణాలను తీసుకోగా ఈ ఏడాది అంతకన్నా మరో రూ.10,646 కోట్లను అదనంగా తీసుకోవాలని నిర్ణయించింది. అయినా, ఈ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం పథకాలకు గానీ, అభివృద్ధికి గానీ వినియోగించుకునే అవకాశం లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గతంలో తీసుకున్న రుణాలపై అసలు, వడ్డీ కలిపి కిస్తీ కింద నెలకు రూ.5,365 కోట్ల చొప్పున ఈ ఏడాది రూ.64,380 కోట్లను తిరిగి చెల్లించాల్సి ఉందని ఆయన చెప్పారు. ఈ లెక్కన ఈ ఏడాది తీసుకునే రూ.రూ.62,212 కోట్ల రుణాలకు మరో రూ.2,168 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ సొంత సొమ్ము కలిపి కిస్తీల కింద రూ.64,380 కోట్లను కట్టాల్సి ఉంటుందని భట్టి వివరించారు. కొంతవరకైనా అప్పులు తీసుకోకపోతే రాష్ట్ర ఆదాయం నుంచి ఈ కిస్తీలను కడితే సంక్షేమం, అభివృద్ధి పథకాలకిక నిధులుండవని తెలిపారు.

# ఎమర్జెన్సీని మించిన అరాచకం

- మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనలపై ఒక్కసారైనా సమీక్షించారా? కనీసం ఖండించారా? లేని దిశ చట్టం ఉన్నట్లు అసత్య ప్రచారం చేశారు. ఎవరైనా అత్యాచారాలకు పాల్పడితే.. 24 గంటల్లో వారిపై చర్యలు తీసుకుంటామంటూ ప్రగల్భాలు పలికిన నాటి ముఖ్యమంత్రి... ఒక్కరిపైనైనా చర్యలు తీసుకున్నారా? ఆయన సభలో ఉండుంటే వీటన్నింటిపైనా అడిగేవాళ్లం. స్థానిక సంస్థల ఎన్నికల్లో హింసకు తెగబడి, ఎక్కువ స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నారు. అందుకే ఆ ఎన్నికలను బహిష్కరించాం. నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ అలాంటి నిర్ణయం తీసుకోలేదు.

**గంజాయి దొరకని గల్లీ లేదు**

దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని చిరునామా ఆంధ్రప్రదేశ్ అనేలా మార్చేశారు. గత ఐదేళ్ల పాలన వల్ల రాష్ట్రంలో గంజాయి అవుట్‌లెట్ లేని గ్రామం, పట్టణం, గల్లీ లేదు. వీటిపై గత ముఖ్యమంత్రి ఒక్కరోజైనా సమీక్షించారా? మేం అధికారంలోకి రాగానే మంత్రివర్గ ఉపసంఘం వేశాం. అధికారిక కమిటీ వేశాం. తెలంగాణతో కలిసి పనిచేస్తున్నాం. నిర్దిష్ట సమయంలో గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం.

**'హూ కిల్డ్ బాబాయ్' త్వరలో తేలుతుంది**

'హూ కిల్డ్ బాబాయ్' అనేది త్వరలోనే తేలుతుంది. మాజీమంత్రి వివేకానందరెడ్డిని చంపేసి సాక్షి ఛానెల్‌లో గుండెపోటుతో మృతి చెందారంటూ స్క్రోలింగ్ వేశారు. అది గుండెపోటని సాక్షి వారికి ఎవరు చెప్పారు? ఆ తర్వాత ఘటనాస్థలానికి పోలీసులు రావాల్సిన అవసరం లేదంటూ వైఎస్ అవినాష్‌రెడ్డి అడ్డుకున్నారు. జగన్ మామ ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి సిబ్బందిని పిలిపించి మృతదేహంపై గొడ్డలిపోట్లు కనిపించకుండా బ్యాండేజీలు చుట్టించారు. ఈ హత్య ఘటనపై ఎవరూ మాట్లాడకూడదంటూ కోర్టుకు వెళ్లి గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారు. చివరికి వివేకా కుమార్తె సునీతను కూడా నమ్మించారు. ఆ తర్వాత ఆమె నిజం తెలుసుకుని వారిపై పోరాడారు. విచారణకు వచ్చిన సీబీఐ దర్యాప్తు అధికారులపైనే కేసు పెట్టారు. అవినాష్‌రెడ్డికి బెయిల్ వచ్చే వరకూ అరెస్టు కాకుండా అడ్డుకున్నారు.

కరోనా సమయంలో మాస్కులు అడిగిన డాక్టర్ సుధాకర్‌పై పిచ్చివాడని ముద్రవేసి ఆయన మరణానికి కారకులయ్యారు.

నాపైనే 17 కేసులు పెట్టారు..

నా జీవితంలో ఏనాడూ కేసులు లేవు. గత ఐదేళ్లలో ఏకంగా 17 కేసులు పెట్టారు. జెడ్ కేటగిరీ భద్రతలో ఉన్న నా ఇంటిపై డ్రోన్ ఎగరవేశారు. ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ బాధితులను పరామర్శించేందుకు వెళ్తే విశాఖపట్నం విమానాశ్రయం నుంచి నన్ను కదలనీయకుండా చేశారు. చలో ఆత్మకూరుకు వెళ్తుంటే మా ఇంటి గేటు తాళ్లతో కట్టేసి అడ్డుకున్నారు.

పవన్ కల్యాణ్ విశాఖపట్నం వెళ్తే అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ నోటీసులిచ్చి హోటల్ నుంచి బలవంతంగా పంపించేశారు. నన్ను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు పరామర్శించేందుకు పవన్ కల్యాణ్ వస్తుంటే.. ఆయన్ను రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకున్నారు. ఆయన రోడ్డుపై పడుకుని నిరసన తెలపాల్సిన పరిస్థితి కల్పించారు. లోకేశ్ యువగళం పాదయాత్ర చేపడితే.. మైక్ ఇవ్వకుండా చేశారు. బెంచ్ లాగేశారు. గోదావరి వంతెన మూసేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఏకంగా 66 కేసులు పెట్టారు. పల్లా శ్రీనివాస్ ఆస్తులు విధ్వంసం చేశారు. ఆదిరెడ్డి భవాని కుటుంబ చిట్‌ఫండ్ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు సీఐడీతో కేసులు పెట్టించారు. ప్రత్తిపాటి పుల్లారావు, బీటెక్ రవి, ధూళిపాళ్ల నరేంద్ర, కూన రవికుమార్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలపై కేసులు పెట్టారు. పంచుమర్తి అనురాధ, ఆదిరెడ్డి భవాని, గౌతు శిరీషలను వేధించారు.

**ఫర్నిచర్ ఇవ్వని జగన్‌పై ఏం కేసు పెట్టాలి?**

మాజీ సభాపతి కోడెల శివప్రసాదరావుపై ఫర్నిచర్ ఉంచుకున్నారంటూ అక్రమ కేసులు పెట్టారు. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో కూడా ప్రభుత్వ ఫర్నిచర్ ఉంది. మరి ఆయనపై ఏం కేసు పెట్టాలి? ఎంపీ రఘురామకృష్ణరాజును అరెస్టు చేసి కొడుతుంటే ఆనాటి ముఖ్యమంత్రి జగన్ వీడియోకాల్‌లో ఆ దృశ్యాలు చూసి పైశాచికానందం పొందారు. ఒక ఎంపీని ఐదేళ్లపాటు సొంత నియోజకవర్గానికి కూడా వెళ్లనివ్వకుండా, ఆ నియోజకవర్గంలో ప్రధాని పర్యటించినా హాజరుకాలేని పరిస్థితిని సృష్టించారు.

**అందరూ ఇబ్బందిపడ్డారు..**

గత ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం సభలో ఉన్నవారందరూ ఇబ్బంది పడ్డారు. నేను కూడా తోట చంద్రయ్యలాంటి కార్యకర్తల్ని పోగొట్టుకున్నాను.

పులివెందులలో హత్యాచారానికి గురైన దళిత మహిళ నాగమ్మ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన వంగలపూడి అనిత, ఎం.ఎస్.రాజులపై ఎట్రాసిటీ కేసులు పెట్టారు. ఎస్సీలపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి దుర్వినియోగం చేశారు. పైల్స్ ఆపరేషన్ చేయించుకున్న అచ్చెన్నాయుణ్ని అరెస్టు చేసి, పాశవికంగా 600 కి.మీ. వాహనంలో తిప్పారు.

# వెల్లువలా పెద్దిరెడ్డి భూ బాధితులు

- మొదటి పేజీ తరువాయి

ఆర్పీ సిసోదియా గురువారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. వందలమంది బాధితులు వినతిపత్రాలు, ఫిర్యాదులు అందజేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో వైకాపా నేతలు తమ భూములను దౌర్జన్యంగా లాగేసుకున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే దాడులు చేశారని వాపోయారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల నుంచి వెల్లువలా తరలి వచ్చారు. వారి నుంచి జోరు వానలోనే రాత్రి 8 గంటల వరకు సిసోదియా ఫిర్యాదులు స్వీకరించారు.

**విశ్రాంత పోలీసు అధికారికే దిక్కులేదు**

తిరుపతి ఎస్పైగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన చౌలేశ్వరయ్య.. వైకాపా నేతలు తమ కుటుంబ భూమిని దోచుకున్న తీరును సిసోదియాకు వివరించారు. తన తల్లి జయమ్మ పేరిట చిత్తూరు జిల్లా సదుంలో సర్వే నంబరు 495/3లో 1.69 ఎకరాలు, 495/2లో 1.85 ఎకరాల భూమి ఉండగా పెద్దిరెడ్డి చిన్నాన్న కుమారుడు పెద్దిరెడ్డి వేణుగోపాలరెడ్డి కబ్జా చేశారని ఆరోపించారు. తన సోదరుడు చెన్నకేశవులుకు చెందిన 4.50 ఎకరాల భూమిని సైతం కాజేశారని మొర పెట్టుకున్నారు. తమతో పాటు ఎందరో బాధితులు ఉన్నప్పటికీ భయంతో ముందుకు రాలేదని సిసోదియా దృష్టికి తెచ్చారు.

**ఏ పది మందో వస్తారనుకుంటే..**

బాధితుల స్పందన చూసి ప్రత్యేక సీఎస్ సిసోదియా ఆశ్చర్యపోయారు. తన పిలుపునకు స్పందించి ఏ పది మందో వస్తారనుకుంటే, వందల మంది తరలిరావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 'అర్జీలన్నింటిపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తాం. ఎవరైనా భూకబ్జాలకు పాల్పడి ఉంటే, వాటిని వెనక్కి తీసుకుని వాస్తవ యజమానులకు అప్పగిస్తాం. ఇంత పెద్ద సంఖ్యలో బాధితులు వచ్చారంటే వ్యవస్థలోనూ ఎక్కడో లోపాలున్నాయనిపిస్తోంది. ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టాలని భావిస్తున్నాం. సబ్ కలెక్టరేట్ దహనం ఘటనపై ఫోరెన్సిక్ నివేదిక రాగానే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు. వీరంతా ఏ తిరునాళ్లకో, జాతరకో వచ్చిన జనం కాదు. బాధితులు.. పీడితులు.. వైకాపా జమానాలో అధికార అండతో పెద్దిరెడ్డి కుటుంబం, అనుచరగణం సాగించిన అక్రమాలకు, అరాచకాలకు బలైన పేదలు. వారి గొంతు వినేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిన్న చొరవ చూపింది. రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ ఆర్పీ సిసోదియాను గురువారం మదనపల్లెకు పంపించింది. వినతులు స్వీకరించనున్నట్లు ప్రకటించింది.

# ఆర్థిక స్థితి సంక్లిష్టం.. అయినా సంక్షేమాన్ని విస్మరించం

'రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తామని ఉత్తరకుమార ప్రగల్భాలు పలికిన గత పాలకులు అన్ని రంగాల్లో విఫలమయ్యారు. ప్రణాళికాబద్ధంగా నడపాల్సిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒంటెత్తు పోకడలతో సొంత జాగీరులా నడిపారు. గత ప్రభుత్వ తప్పిదాల పర్యవసానాన్ని మేం చవిచూస్తున్నాం. మా సర్కారు ఏర్పడేనాటికే కుంటుపడ్డ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం మేం ఎదుర్కొన్న పెనుసవాల్.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉన్నా సంక్షేమాన్ని విస్మరించకుండా గత డిసెంబరు నుంచి నేటి వరకు రూ.34,579 కోట్లను వివిధ పథకాలపై ఖర్చు చేశాం. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం స్థాపిస్తామన్న వాగ్దానాన్ని నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తాం' అని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గురువారం 2024–25 బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన రెండు గంటలపాటు ప్రసంగించారు.

**అనర్హులకు రైతుబంధు క్షమించరాని నేరం**

'గత ప్రభుత్వంలా కాకుండా రైతులకు ఒకేసారి రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయాలని మా ప్రభుత్వం సంకల్పించింది. గత ప్రభుత్వం రైతుబంధు కింద వెచ్చించిన రూ.80,440 కోట్లలో అధిక శాతం అనర్హులకే దక్కాయి. అది క్షమించరాని నేరం. అర్హులకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటుచేసి అభిప్రాయాలు సేకరించాం. త్వరలోనే విధివిధానాలపై నిర్ణయం తీసుకుంటాం. భూమిలేని రైతుకూలీలకు సంవత్సరానికి ఎకరాకు రూ.12 వేలు చెల్లించే బృహత్ కార్యాన్ని ఈ ఏడాదే ప్రారంభించబోతున్నాం. గత ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లించక రైతు కడగండ్లకు కారణమైంది. ఈ ఏడాది నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించాం. మొత్తం ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వం గుర్తించిన 33 రకాల వరి ధాన్యాలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించాం. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్ల చెల్లింపులు సకాలంలో జరిగేవి కావు. మేం 48 గంటల్లోనే చెల్లిస్తున్నాం. ఇప్పటివరకు రూ.10,556 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశాం. మేం వచ్చేనాటికి సుమారు 1000 మంది మిల్లర్లు ప్రభుత్వానికి రూ.3000 కో ట్లు బకాయిపడ్డారు. గత ఆరు నెలల్లోనే మిల్లర్ల నుంచి రూ.450 కోట్లు వసూలు చే శాం. కొత్త వ్యూహాలతో కేంద్రం నుంచి రూ. 3561.64 కోట్లను సాధించుకో గలిగాం.

## నేడు ఢిల్లీకి ఏపీ సీఎం చంద్రబాబు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు (జులై 26) రాత్రి ఢిల్లీ పయనం కానున్నారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు చంద్రబాబు ఢిల్లీ చేరుకోనున్నారు. ఎల్లుండి (జులై 27)న ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకానున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఏపీకి సంబంధించిన అనేక అం శాలపై సీఎం చంద్రబాబు గళం వినిపించనున్నారు. ము ఖ్యంగా, పోలవరం అంశాన్ని కేంద్రం పెద్దల ఎదుట ప్రస్తా వించనున్నారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి నీతి ఆయోగ్ ముందు ప్రతిపాదనలు ఉంచనున్నారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా గతంలో నిర్దేశించిన మేరకే కట్టుబడి ఉండాలని ఏపీ క్యాబినెట్ సమావేశంలో తీర్మానించిన అంశాన్ని కూడా ఆయన కేంద్రానికి వివరిం చనున్నారు. నీతి ఆయోగ్ సమావేశం ముగిసిన అనం తరం అదే రోజు సాయంత్రం విజయవాడకు తిరిగి రానున్నారు.

## అనవసరంగా గెలిచా..

తాను ఎమ్మెల్యేగా అనవసరంగా గెలిచి అసెంబ్లీకి వచ్చానని బాధగా అనిపిస్తోందంటూ కామారెడ్డి బీజేపీ బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు బాధాకరంగా ఉందని పేర్కొన్నారు. లోపల ఒకరినొకరు తిట్టుకుని బయట మాత్రం చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారని విమర్శించారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన తనకు సభలో ఎలా వ్యవహరించాలో తెలుసని చెప్పారు. గతంలో అసెంబ్లీ మీదుగా వెళ్లేటప్పుడు ఎప్పుడెప్పుడు అసెంబ్లీకి వెళ్తానా అని అనుకునే వాడినని, ప్రజలకు ఎమ్మెల్యేలు మంచి చేస్తారని భావించేవాడినని గుర్తుచేసుకున్నారు. కానీ, కొందరు జీతాలు తీసుకుని కూడా అసెంబ్లీకి రావడం లేదని, మరికొందరు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇద్దరు నాయకులు మాట్లాడితే మిగతా 60 మంది వారికి భజన చేస్తున్నారని దుయ్యబట్టారు. అసలు అసెంబ్లీలో ప్రజల గురించి మాట్లాడే నాయకులే లేరని, ప్రజా సమస్యల గురించి ప్రస్తావించాలన్న ఆలోచన కూడా వారికి ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఘోష నేతలకు వినపడడం లేదన్నారు. అంతమాత్రాన తానేం సత్యహరిశ్చంద్రుడిని కాదని చెప్పుకొచ్చారు.

## అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్రారంభం

- మొదటి పేజీ తరువాయి

ఇస్తుండడంతో సమీకరణ విధానంలో భూములు ఇచ్చేందుకు పలువురు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. పెనుమాకలో రాజధాని, సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి రెండు రోజుల్లో రైతులు 2.65 ఎకరాలను ఇచ్చారు. తాజాగా కేంద్ర బడ్జెట్‌లోనూ అమరావతి నిర్మాణానికి తోడ్పాటు అందించనున్నట్లు మోదీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పూలింగ్‌లో భూములిచ్చేందుకు ముందుకొచ్చే వారి నుంచి తీసుకోవాలని సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్.. రాజధానిలో భూ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న డిప్యూటీ కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ ప్రక్రియను నిలిపివేయడంతో పాటు గత తెదేపా ప్రభుత్వం ఇచ్చిన భూసేకరణ ప్రకటనను కూడా ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. రాజధాని నిర్మాణానికి తెదేపా ప్రభుత్వం 25,398 మంది రైతుల నుంచి 34,281 ఎకరాలను సమీకరణ విధానంలో తీసుకుంది. మరో 4 వేల ఎకరాలను సమీకరించాల్సి ఉండగా, రైతులు ముందుకు రాకపోవడంతో అప్పట్లో ఆ ప్రక్రియ ఆగిపోయింది. అమరావతిలో గవర్నమెంట్, జస్టిస్, ఫైనాన్స్, నాలెడ్జ్, ఎలక్ట్రానిక్స్, హెల్త్, స్పోర్ట్స్, మీడియా, టూరిజం సిటీల పేరుతో నవ నగరాలను నిర్మించే ప్రణాళికతో అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించింది. ఈ బృహత్ ప్రణాళికను యథాతథంగా పట్టాలెక్కించేందుకు అప్పట్లో భూములు ఇవ్వని గ్రామాల్లో సమీకరణ పద్ధతిలో తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఎక్కువ విస్తీర్ణంలో స్థలాలు తీసుకోవాల్సిన ప్రాంతాల్లో యూనిట్ కార్యాలయాలను ప్రారంభించారు. ఉండవల్లి, పెనుమాక, రాయపూడి, మందడం, వెలగపూడి, నిడమర్రు తదితర గ్రామాల్లో భూమి సమీకరించాల్సి ఉంది. ఈ విధానంలో భూమి ఇచ్చే వారికి త్వరలో రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించనున్నారు. మరోపక్క, రాజధానిలో కార్యకలాపాలు ఊపందుకోవడంతో సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఇతర శాఖల నుంచి అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకునేందుకు సీఆర్డీఏ కమిషనర్ ఓ ప్రకటనలో దరఖాస్తులు ఆహ్వానించారు.

## గనులు, ఖనిజ భూములపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలదే

- మొదటి పేజీ తరువాయి

పలికింది. ఖనిజ భూములు, గనులపై పన్నులు విధించే శాసనాధికారం రాష్ట్రాలకు ఉందని 9 సభ్యుల ధర్మాసనం 8–1తో మెజారిటీ తీర్పు వెలువరించింది. రాయల్టీని పన్నుగా పరిగణిస్తూ గతంలో ఇండియా సిమెంట్స్ కేసులో రాజ్యాంగధర్మాసనం ఇచ్చిన తీర్పు చెల్లదని ప్రకటించింది. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం–1957 కూడా రాష్ట్రాలకు పన్నుల విధించే అధికారంపై నియంత్రణలు విధించలేదని పేర్కొంది. రాజ్యాంగం ఏడో షెడ్యూల్‌లో రెండో జాబితాలోని ఎంట్రీ 50 కూడా రాష్ట్రాల హక్కులనే చెబుతోందని తెలిపింది. "శాసనసభలకు పన్నులు విధించే అధికారం తగ్గిస్తే అది రాష్ట్రాల ఆదాయంపై ప్రభావం చూపుతుంది. అలా జరిగితే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడతాయి. పన్నుల అధికారాన్ని నిర్ణయించేటపుడు ఈ విషయాలను రాజ్యాంగ ధర్మాసనాలు పరిగణనలోకి తీసుకోవాలి. సమాఖ్య స్ఫూర్తిని పలుచన చేయకుండా జాగ్రత్త వహించాలి. రాష్ట్రాలకే పూర్తిగా కేటాయించిన అధికారాల్లో కేంద్రం పెత్తనం లేకుండా చూడాలి" అని 200 పేజీల తీర్పులో పేర్కొంది. అయితే ఖనిజహక్కులపై రాష్ట్రాల పన్నుల అధికారం ఆ రంగ అభివృద్ధికి ఆటంకం కలిగించే తగు చర్యలు తీసుకొనే అధికారం పార్లమెంటుకు ఉందని కూడా ధర్మాసనం పేర్కొనడం గమనార్హం. ఈ మెజారిటీ తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, ధర్మాసనంలోని ఏడుగురు న్యాయమూర్తులు (జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర, జస్టిస్ ఉజ్జల్‌భుయాన్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్) వెలువరించారు. జస్టిస్ బి.వి.నాగరత్న మాత్రం ఇందుకు భిన్నమైన తీర్పును రాశారు. గనులు, ఖనిజభూములపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలకు లేదని పేర్కొన్నారు. మెజారిటీ తీర్పు వెలువడగానే గతంలో కేంద్రం వసూలు చేసిన పన్నులు వెనక్కి ఇప్పించాలని ధర్మాసనాన్ని రాష్ట్రాలు కోరాయి. తీర్పును వెనక తేదీ నుంచి అమలు చేయాలని అభ్యర్థించాయి. ఈ వాదనలను కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు. ఈ అంశాన్ని ఈ నెల 31న నిర్ణయిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును ఝార?ండ్, ఒడిశా ప్రభుత్వాలు స్వాగతించాయి.

## అన్ని వర్గాలకూ మోసం

- మొదటి పేజీ తరువాయి

లేదని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీల్చి చెండాడతామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రతిపక్ష నేతగా గురువారం శాసనసభలోకి కేసీఆర్ తొలిసారి అడుగుపెట్టారు. భారాస ఎమ్మెల్యేలు ఆయన వెంట నడిచారు. ఆయన ఛాంబర్‌లో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ప్రారంభించే సమయానికి అసెంబ్లీ హాలులోకి కేసీఆర్ సహా భారాస ఎమ్మెల్యేలు అడుగుపెట్టారు. ప్రసంగం పూర్తికాగానే వెలుపలికి వచ్చిన కేసీఆర్ మీడియా పాయింట్‌కు చేరుకున్నారు. గులాబీ అధినేత అక్కడికి వస్తారని మీడియా ప్రతినిధులు సహా భారాస ఎమ్మెల్యేలు కూడా ఊహించలేదు. దీంతో ఒక్కసారిగా సందడి నెలకొంది. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కేసీఆర్ మాట్లాడడం ఇదే తొలిసారి. కేసీఆర్ వెంట భారాస ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, కౌశిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

# నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి శఠగోపం పెట్టింది : మహిమూద్ ఖాన్.

- ఎనిమిది మంది ఎంపీలున్నా తెలంగాణకు గుండు సున్నా!
- రీ ఆర్గనైజేషన్ యాక్ట్ ఫలాలు.. ఏపీకేనా.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు చోటేది?



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 25,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు మహిమద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీలను ఎనిమిది మంది గెలిపించినా రాష్ట్రానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి శఠగోపం పెట్టింది. అని కేంద్ర బడ్జెట్ లో ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ ను ప్రత్యేకంగా ప్రస్తావించినా ఆ యాక్ట్ పరిధిలోకి వచ్చే తెలంగాణ పేరు కూడా ప్రస్తావించలేదు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ మంగళవారం లోక్ సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎక్కడా తెలంగాణ పేరే లేదు. మోదీ 3.0 ప్రభుత్వాన్ని నిలబెట్టిన జేడీయూ, టీడీపీ పాలిత రాష్ట్రాలైన బిహార్, ఏపీకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ లో భాగంగా ఏపీకి ఇచ్చిన హామీలను ఫుల్ ఫిల్ చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని బడ్జెట్ లో వెల్లడించారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందజేస్తామని, రాబోయే సంవత్సరాల్లో మరింత ఆర్థిక సాయం చేస్తామని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఆ ప్రాజెక్టు ఏపీకి లైఫ్ లైన్ అని, దేశానికి ఆహార భద్రత కల్పించే ప్రాజెక్టు అని కీర్తించారు. రీ ఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారంఏపీలో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు నందిస్తామన్నారు. విశాఖపట్నం – చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కు తోడ్పాటు నందిస్తామని పేర్కొన్నారు. కొప్పర్తి – ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ కు అవసరమైన మౌలిక వసతులన్నీ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక ప్రగతికి దోహదం చేసే పారిశ్రామిక కారిడార్లకు ఈ ఆర్థిక సంవత్సరంలో అదనపు నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు సంబంధించిన ఏకైక అంశం హైదరాబాద్ – బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్. ఈ కారిడార్ కు ఆర్థిక తోడ్పాటు నందిస్తామని వెల్లడించారు. వెనుకడిన ప్రాంతాలైన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర కోస్టల్ ఏరియాకు బ్యాక్ రీజియన్ గ్రాంట్స్ అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు ఇదే కోటాలో నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. తెలంగాణలోని ఏ ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టుకు కనీసం ఫైనాన్షియల్ అసిస్టెన్స్ ప్రకటించలేదు. రేవంత్ రెడ్డి సీఎం అయిన కొత్తలో పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధిస్తామని గొప్పగా చెప్పినా ఆ ప్రాజెక్టును కనీసం ఏఐబీపీ స్కీంలో కూడా పరిగణలోకి తీసుకోలేదు. తెలంగాణకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం ఒక్క కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా సాధించింది ఏమీ లేదు అని. సిరిసిల్ల కు మెగా పవర్ లూమ్ క్లస్టర్, వరంగల్ టెక్స్ టైల్ పార్క్‌కు ఆర్థిక సాయం, తెలంగాణలోని ఇండస్ట్రియల్ కారిడార్లకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్ ఊసు లేకుండా నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ లోనే హామీ ఇచ్చిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావనే లేదు. ములుగు ట్రైబల్ యూనివర్సిటీకి అదనపు నిధుల అంశం లేదు. తెలంగాణకు జాతీయ విద్యా సంస్థల కేటాయింపు ముచ్చటే లేదు అని ఆయన మండిపడ్డారు..

# ఛలో పోచంపల్లి కార్యక్రమానికి భారీ ర్యాలీగా తరలిన నేతన్నలు....




**సి కే న్యూస్ (సంపత్) జులై 25 :** ఛలో పోచంపల్లి కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలేరు పట్టణ కేంద్రంలోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశ్రీ అవార్డ్ గ్రహీత చింతకింది మల్లేశం,ఆలేరు పట్టణ పద్మశాలి అధ్యక్షులు పాసికంటి శ్రీనివాస్,తాజా మాజీ అధ్యక్షులు బింగి నరసింహులు పూలమాలలు వేసి. చేనేత కళాకారులతో కలిసి భారీ ర్యాలీగా స్వామి వివేకానంద విగ్రహం వరకు చేనేత రహిత ప్రింటింగ్ చీరలను, చేనేత చట్టం 1986 అమలు కై ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని కోరుతూ నినాదాలు చేస్తూ చేనేత కళాకారులు 300 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహం నుండి నాలుగు డి సి యం లలో,ఎనిమిది కార్లలో చలో పోచంపల్లి కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లినట్టు ఆలేరు పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి చిక్క శ్రవణ్ కుమార్ తెలిపారు.గురువారం ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం మాట్లాడుతూ ప్రింటింగ్ చీరల వలన చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి 1986 చట్టం ప్రకారం ప్రింటింగ్ చీరలను ఆపాలని ఆయన కోరారు. ప్రింటింగ్ చీరల వల్ల చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి, కుటుంబం గడవడమే కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలేరు పట్టణ పద్మశాలి సంఘం నాయకులు ఆలేరు మూడో వార్డు కౌన్సిలర్ బేతి రాములు,పద్మ సుదర్శన్,బడుగు జహంగీర్, ఆడెపు బాలస్వామి,గుజ్జ అశోక్, బేతి శ్రీనివాసు,భోగ సంతోష్, భోగ వెంకటచలం, ఎలగందుల యాదగిరి,రేగోటి వెంకటేష్,మెరుగు శ్రీధర్,రచ్చ దత్తు,ఎలగందుల ఉమా ఋషి, సత్య ఋషి, చిట్టిమెల్ల వెంకటేష్,గట్టు రాజు,కటకం లక్ష్మణ్,చింతకింది గిరి,చింతకింది కృష్ణ మూర్తి,అమృతం నర్సింలు,ఏల వెంకటేష్ ఏల చంద్రమౌళి, రచ్చ హనుమంతు, గుండు విట్టల్, బేతి ఉప్పలయ్య,చింతకింది సత్యనారాయణ,చందా ఉపేందర్ చిటిమెల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# సంతాప సభను విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ .

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్.



**సీ కే న్యూస్ సత్తుపల్లి ప్రతినిధి మునిర్.**

ఈనెల 28న ఖమ్మంలో జరుగు సిపిఎంఎల్ మాస్ లైన్ జాతీయ నాయకులు అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ రాయల్ చంద్రశేఖర్ సంతాప సభను విజయవంతం చేయాలని సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నీలం రామచంద్రయ్య భవనంలో సంతాప సభ పోస్టర్లు ఆవిష్కరణ చేయటం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కల్లూరు డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి శరత్ మాట్లాడుతూ కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ అన్న ఖమ్మం జిల్లా తిరుమల పాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో జన్మించాడని, ఇంటర్ చదు వుతున్న ఇప్పుడే తన పెద్ద నాన్న అయిన రాయల వెంకటనారాయణ అన్న రాయాల సుభాష్ చంద్రబోస్ ఉద్యమనే పద్యంతో వారి స్ఫూర్తితో విప్లవ రాజకీయాలకు ప్రవేశించాడని డిగ్రీ ఖమ్మం ఎస్సార్ అండ్ బీజేఎన్ఆర్ కళాశాలలో చదువుతున్నప్పుడు పిడిఎస్ యు నాయకుడిగా ఎదిగాడని, ఆ క్రమంలోనే కళాశాల ఎన్నికల్లో 73 74 ప్రాంతంలో విద్యార్థి సంఘ సహాయ కార్యదర్శి ఎన్నికయ్యాడని తర్వాత ఎమర్జెన్సీ నాటికి చదువు వదిలేసి విప్లవ నిర్మాణం కోసం రహస్య జీవితానికి వెళ్ళాడని, సత్తుపల్లి మణుగూరు అశ్వాపురం ప్రాంతంలో వెల్లేరుపాడు ప్రాంతాల్లో ప్రతిఘటన దళాలు పనిచేశాడని ఎమర్జెన్సీ అనంతరం లీగలుగా ఖమ్మం హైదరాబాద్ తదితర వరంగల్ జిల్లాలో పనిచేశారని కొంతకాలం హైదరాబాద్ కేంద్రంగా పనిచేశారని వారు అన్నారు. పార్టీ ఏ బాధ్యతలు ఇచ్చిన ఎలాంటి శేషాభిషాలు లేకుండా అంకితభావంతో భుజాలకు ఎత్తుకున్నాడని నిర్బంధ కాలంలో సహితం కార్యకర్తలతో సంబంధాలను నిలిపాడని పోలీసులు దాడుల సమయంలో కూడా ఎంతో సహనంతో ధైర్యంగా వ్యవహరించాడని కార్యకర్తలకు ప్రజలకు ఎంతో అండగా ఉంటూ విశ్వాసాన్ని కలిగించాడని, వారు అన్నారు. ఖమ్మంలో ఈనెల 28వ తేదీన జరుగు సంతాప సభకు ఆల్ ఇండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్,రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుగారు , రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేజీ రామచంద్రర్, కెచ్చల రంగారెడ్డి, ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య , జిల్లా కార్యదర్శి గోకనపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించనున్నారని, ఈ కార్యక్రమానికి ప్రజలు ప్రజా సమితి వాదులు శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా వారు కోరారు.


ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తాటి రాజు, దుంపరాగవులు, ఒగ్గు నాగిరెడ్డి, బలగాని శీను, తదితరులు పాల్గొన్నారు.

# మరణించిన వారి కుటుంబానికి సాహాయం అందించిన యువ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్



**సీ కే న్యూస్ చేగుంట జులై 25 రిపోటర్ (కొండి శ్రీనివాస్ :** చేగుంట మండల్ మక్కారాజుపేట గ్రామంలో ఇటీవల కాంగ్రెస్ కార్యకర్త జింక స్వామి అనారోగ్యంతో మరణించడం జరిగింది ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు యువ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్ 50 కేజీ బియన్ని అందించడం జరిగింది ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ వడ్ల నవీన్ దుబ్బాక నియోజకవర్గ యువజన నాయకుడు సాయి కుమార్ గౌడ్ గ్రామ ప్రెసిడెంట్ కొండారెడ్డి రాజారాం మరియు బెస్తరాజయ్య చింతకింది రాజు మాజీ మండల సమన్వయ రైతు అధ్యక్షుడు జింక శ్రీనివాస్ జింక స్వామి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది

# భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారి... జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.



GODAVARI FLOODS-2024:

FAX/MAIL MESSAGE

TO : THE COLLECTOR & DISTRICT MAGISTRATE, BHADRADRI KOTHAGUDEM.

INFORM : THE PROJECT OFFICER, ITDA, BHADRACHALAM

FROM : THE REVENUE DIVISIONAL OFFICER, BHADRACHALAM

RC.NO.D/1329/2024, DT. 25-07-2024, AT 01.10 PM

GODAVARI FLOODS-2024(.) BHADRADRI KOTHAGUDEM DISTRICT (.) BHADRACHALAM DIVISION & MANDAL(.) GODAVARI WATER LEVEL REACHED 48 FEET ON 25-07-2024 AT 01.10 PM(.) SECOND WARNING ISSUED(.) FORECAST INDICATES FURTHER RISE(.) ALL THE FLOOD DUTY OFFICERS TAKE ACTION AS PER THE GODAVARI FLOOD MANUAL(.)

REVENUE DIVISIONAL OFFICER
BHADRACHALAM

COPY TO:

THE SUPERINTENDENT OF POLICE, BHADRADRI KOTHAGUDEM AND CIRCLE INSPECTOR (COMMUNICATIONS).

THE ASST.SUPERINTENDENT OF POLICE, BHADRACHALAM.

THE ASST.SUPERINTENDENT OF POLICE, MANUGURU.

ALL THE SECTORAL OFFICERS.

THE EXECUTIVE OFFICER, SSRD, BHADRACHALAM.

THE DISTRICT PUBLIC RELATION OFFICER, BHADRADRI KOTHAGUDEM.

THE TAHSILDAR, CHARLA/DUMMUGUDEM/BHADRACHALAM/BURGAMPAHAD/ASWAPURAM/MANUGURU/PINAPAKA.

THE M.P.D.O., CHARLA/DUMMUGUDEM/BHADRACHALAM/BURGAMPAHAD/ASWAPURAM/MANUGURU/PINAPAKA.

THE SUB-INSPECTOR OF POLICE, CHARLA/DUMMUGUDEM/BHADRACHALAM/BURGAMPAHAD/ASWAPURAM/MANUGURU/PINAPAKA.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 25,**ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకారంగా గోదావరి పరివాహక ప్రాంతంలో వరద ప్రవాహం క్రమేపి పెరుగుతూ వస్తున్నదని ఈ నేపథ్యం లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచల పట్టణం వద్ద గురువారం మధ్యాహ్నం 1:10 గంటలకు నీటి ప్రవాహం 48 అడుగుల స్థాయికి చేరుకోవడంతో రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు జిల్లా యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. అధికార యంత్రాంగం, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజలు ఇళ్ళ నుండి బయటకి రావొద్దని, అత్యవసర సేవలకు కంట్రోల్ రూము నంబర్లు కు కాల్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# నిరుపేద విద్యార్థి భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన - మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్.

**ఇంజనీరింగ్ విద్య కొరకు 17000/- నగదు అందుచేత.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 25,**భద్రాచలం పట్టణంలోని గొల్ల బజార్ వీధిలో ఉంటున్న ముదిగొండ జస్వంత్ టి జి ఈ ఏ పి, సి ఈ టి 2024 ఇంజనీరింగ్ లో మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ లోనీ జేఎన్టీయూ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ సీ ఎస్ సీ లో సీటు వచ్చింది. జస్వంత్ కి ఇంజనీరింగ్ చదవాలని కల ఉన్నప్పటికీ,తండ్రి అనారోగ్యంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. కుటుంబ పోషణ సైతం కష్టంగా మారింది. దీంతో జస్వంత్ ఇంజనీరింగ్ చదవాలని కల కష్టంగా మారింది.....

నిరుపేద విద్యార్థి భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన మదర్ తెరిసా ట్రస్ట్ చదువుకోవాలని ఆశ ఉన్న ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న జస్వంత్ పరిస్థితి మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించి మదర్ థెరిస్సా ట్రస్ట్ సభ్యులు మరియు దాతల సహకారంతో ఇంజనీరింగ్ చదువు కోసం 17000/– రూపాయలు, భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ మధు ప్రసాద్ చేతుల మీదుగా పేద విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ మధు ప్రసాద్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాదని ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్నది సాధించవచ్చు అని తెలిపారు. అలాగే నిరుపేద విద్యార్థి కోసం మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చి చేయూతనివ్వడం అభినందనీయమని అన్నారు. ఏజెన్సీలో మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు.

ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి మాట్లాడుతూ... పేద విద్యార్థి ముదిగొండ జశ్వంత్ కు భవిష్యత్తులో కూడా చదువు కోసం ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. బాగా కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించి, ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. అదేవిధంగా అడగగానే స్పందించి, సహాయం అందించిన భద్రాచలం సీతారామ ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షులు వై .శివ శంకర్ నాయుడు, అప్సరా లాడ్జ్ నిర్వాహకులు చందు, భద్రాద్రి కొత్తగూడెం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు చారుగుల్ల.శ్రీనివాస్, చర్ల రోడ్డు ఎస్బిఐ ఉద్యోగి మల్లారెడ్డి ట్రస్టు సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల. మురళి, చోళ ఇన్స్యూరెన్స్ మేనేజర్ వి.బాలరాజు ,జిలకర. నాగరాజు, కోమటిరెడ్డి చైతన్య సాయి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతా సుఖీభవ



**పలమనేరు నియోజకవర్గం, జూలై 25,.సీ కే న్యూస్** ఇప్పుడున్న ఉరుకు పరుగుల జీవితంలో మన పనులు చూసుకోవడానికే మనకు సమయం సరిపోదు. అటువంటిది సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలంటే పెద్ద మనసు ఉండాలి.

మధుమోహన్రావు పలమనేరు నివాసి. సామాజిక సేవా భిలాషి.

ప్రతినిత్యం ఏదో ఒక సామాజిక సేవా కార్యక్రమం చేస్తూనే ఉంటాడు.

ఈరోజు పలమనేరు మండలంలోని టీ వడ్డూరు మరియు పరిసర ప్రాంతాలలోని దినసరి కూలీలకు అల్పాహారం వితరణ చేశాడు. ఈ సందర్భంగా అన్న ప్రసాద స్వీకర్తలు మాట్లాడుతూ.... మధుమోహన్ అన్న మాకు ఈరోజు టిఫిన్ పంచి పెట్టాడని, తమ సంతోషం వ్యక్తం చేస్తూ.... అన్నదాత సుఖీభవ అని దీవించారు.

మధు మీడియాతో మాట్లాడుతూ.... సేవా కార్యక్రమాలు చేయడంలో నేను ముందుంటానని, దాతల సహకారంతో నేను ఈ సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసే శక్తి ఆ భగవంతుడు నాకు ప్రసాదించాలని ఈ సందర్భంగా మధుమోహన్రావు తన మనసులోని మాటను తెలియజేశారు.

# తోల్ల కిష్టయ్య కుటుంబానికి అండగా నిలిచిన జంబుల బుచ్చా రెడ్డి

- సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ జంబుల బుచ్చా రెడ్డి



**సీకే న్యూస్ ప్రతినిధి, కొల్లాపూర్:**

కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన

తోల్ల కిష్టయ్య అనారోగ్యం కారణంగా గత కొన్ని రోజుల కిందట మృతి చెందడం జరిగింది

ఈ విషయం తెలుసుకున్న గ్రామ సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ జంబుల బుచ్చా రెడ్డి వారి ఇంటికి వెళ్లి వారి చిత్రపటానికి నివాళులర్పించారు అనంతరం ఆయన వారి కుటుంబాన్ని పరామర్శించి అదేవిధంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి 3000 రూపాయలను ఆర్థిక సాయం కింద అందజేసి వారికి అండగా నిలిచారు అదేవిధంగా ఎల్లప్పుడు ఏ ఆపద వచ్చిన నేనుంటానని ఆయన వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జమ్ముల బుచ్చా రెడ్డి తో పాటు ,సింగిల్ విండో డైరెక్టర్ గండు అర్జునయ్య, కురువ ఎజ్జు అంజి, భయ్యా రాంబాబు , స్వామి తదితరులు పాల్గొన్నారు

# జీవకోటి మనుగడ కోసం హరిత వికాసం.



● జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 25,కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల శాఖామాత్యులు కిషన్ రెడ్డి సింగరేణి అన్ని ఏరియాలలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఇచ్చిన ఆదేశంతో సింగరేణి చైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం సూచన మేరకు సింగరేణి ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా ఎంఎన్‌జిఓ సిత పరిసర ప్రాంతాలలో గురువారం వృక్షారోపన్ అభియాన్ ( వి ఏ %-% 2024) కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టరు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ సింగరేణి మరియు కాంట్రాక్ట్ కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... సకల జీవకోటి గతం, ప్రస్తుతం, భవిష్యత్తు హరిత వికాసం తో ముడిపడి ఉంది. చెట్లు ఎన్నో రకాలుగా మేలు చేసే మంచి నేస్తాలు. అవి అందించే అనేక రకాల సేవల్లో వాయు కాలుష్య నివారణ విరివిగా వర్షపాతన్ని పెంచడం అతి ముఖ్యమైనవి. మనం పీల్చే గాలి కాలుష్యమైన కొద్ది మనం అనేక రకాల రుగ్మతల బారిన పడుతాము. అట్టి ప్రమాదము నుండి చెట్టు కాలుష్య భరిత వాయువును తాను పీల్చుకొని స్వచ్ఛమైన ప్రాణవాయువును మనకు అందిస్తుంది. ఇప్పటికే అధిక జనాభాతో భారీ ఎత్తున పట్టణీకరణ, పారిశ్రామికరణ తో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి దేశ జనాభా అనేక రకాల వ్యాధులతో నానా అవస్తలు పడుతున్నారు. కాబట్టి కాలుష్యాన్ని హరించి స్వచ్ఛమైన ప్రాణ వాయువును పొందాలన్నా, విరివిగా వర్షాలు కురిసి త్రాగు నీటి, సాగు నీటి సమస్యలు తీరాలన్న ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా విరివిగా మొక్కలు నాటి చెట్లను పెంచాలి. సింగరేణి యాజమాన్యం సామాజిక బాద్యత నిర్వాహణలో ఎప్పుడు ముందుంతుంది కాబట్టి ఆయా సందర్భాలను పట్టి అన్నీ ఏరియాలలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం తో పాటు హరిత వికాసం యొక్క ఆవశ్యకత పట్ల సింగరేణియు ల్లో, పరిసర గ్రామాల ప్రజలలో అనేక అవగాహన కార్యక్రమాలు చేబట్టడం జరుగుతుంది. ఇక ముందు కూడా సమాజ హితం కోరి సింగరేనియుల కు మరియు స్థానికులకు మరియు పరిసర గ్రామాల ప్రజలకు విరివిగా ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తూ వారిలో అవగాహన పెంచే కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తాము. ఈ కార్యక్రమంలో భాగంగా మణుగూరు ఏరియాలో మొత్తంగా 20,000 మొక్కలు నాటాలని అలాగే 5,000 మొక్కలు పంచాలని లక్ష్యంగా పెట్టుకూనారు. ఈ నిరంతర ప్రక్రియలో భాగంగా నేడు మణుగూరు ఏరియా ఉపరితల గని ప్రాంతంలోని ఖాళీ ప్రదేశం ఒకే రోజులో ఎంతో ఉత్సాహ భరిత వాతావరణంలో దాదాపు 1000 మొక్కలు నాటరు.

మా ఆహ్వానాన్ని మన్నించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వామ్యులైన మణుగూరు ఎంఆర్ఓ రాఘవేంద్ర రెడ్డి, ఎండిఓ శ్రీనివాస్ రావుకి, సింగరేణియుల కు, గుర్తింపు మరియు ప్రాతినిధ్య సంఘాల నాయకులకు మరియు కేఎల్‌పి మహాలక్ష్మి యాజమాన్యానికి మరియు కాంట్రాక్ట్ కార్మికులకు జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మరియు ఇతర ఉన్నత అధికారుల చేతుల మీదుగా కాంట్రాక్ట్ కార్మికులకు సపోటా, అంజీర, మామిడి, తదితర ఫ్రూట్ బెరింగ్ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం డి శ్యామ్ సుందర్ , ఏజిఎం(సివిల్) వెంకటేశ్వర్లు , ప్రాజెక్ట్ అధికారి కేపియూజి వీరభద్ర రావు , ప్రాజెక్ట్ అధికారి ఎంఎన్‌జిఓసిడ శ్రీ శ్రీనివాస చారి , డిజిఎం(ఐఈడ్డి) కే వెంకట్ రావు , డిజిఎం(పర్సనల్) ఎస్ రమేశ్, డిజిఎం( పర్చేస్) శ్రీనివాస మూర్తి, మెడికల్ సూపరింటెండెంట్ శేషగిరి రావు, డిజిఎం(ఫైనాన్స్) అనురాధా , ఏఐటియూసి యూనియన్ నాయకులు సాయి ప్రకాష్ , ఐఎన్‌టియూసి నాయకులు వి. కృష్ణం రాజు, సిఎంఓఏఐ అధ్యక్షుడు కే కృష్ణ మూర్తి , మేనేజర్ మణుగూరు ఓసిర రాజేశ్వర రావు , సేఫ్టీ అధికారి భాస్కర్ రావు, డివైపిఎం పిబి అవినాష్ , పర్యావరణ అధికారి జే శ్రీనివాస రావు , ఈ ఈ (సివిల్) ప్రవీణ్ , ఐటి మేనేజర్ సాయిల సురేశ్ , ఇతర అధికారులు, ఫారెస్ట్ అధికారి కల్యాణ్ , సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న ధర్మోజి గూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ

● మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో 12,000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేత



సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి ( శ్రీనివాస్) జూలై 25:చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామానికి చెందిన ఊదరి ఎల్లమ్మ నిన్న సాయంత్రం అకాల మరణం చెందారు. మృతురాలి దహన సంస్కారాల కొరకు ధర్మోజి గూడెం కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబానికి 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు . ఈ కార్యక్రమంలో రాచకొండ భార్గవ్ ఊదరి శ్రీనివాస్, దాసరి గణేష్, డాకోజీ సతీష్ వంగూరి సురేష్, ఊదరి రవి, దాసరి లింగయ్య, ఐతరాజు శ్రీకాంత్, జంగం సందీప్, ఊదరి మురళి, బద్రి ఉపేందర్, దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు...

● ఘనంగా నిర్వహించిన పా ప కొల్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు







సి కే న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాదావత్ హాథిరాం నాయక్:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గ జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు శ్రీ ఉమాలింగేశ్వర స్వామి దేవస్థానం నందు మొక్కలను నాటి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రోకటి సురేష్ రామిశెట్టి రాంబాబు , హాజరై కేకును కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

రాందాస్ నాయక్ గారి జన్మదిన వేడుకలలో సొసైటీ డైరెక్టర్ పాపిన్ని వెంకయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనార్టీ మాజీ మండల అధ్యక్షులు షేక్ సుభాని తాళ్లూరి అచ్చయ, తాళ్లూరి వీరయ్య , బాదావత్ సామ్య, బాదావత్ లక్ష్మణ్, లేగల నరసింహారావు, నిమ్మటూరి వెంకయ్య, ధరావత్ రవీంద్రబాబు, ధరావత్ నరసింహారావు (%ఐచీ=%), చౌడం శ్రీను, ఊడల శేషగిరి పులిబండ్ల లక్ష్మీనారాయణ, పాపిన్ని రమేష్ మాజీ ఉప సర్పంచ్ కంబాలపల్లి మహేష్, వట్టం ప్రసాద్, బట్టు నరసింహారావు, బలుగూరి నరసింహారావు, ఎట్టి శివకుమార్, బట్టు అశోక్, జబ్బా రామధనం, బొర్రా రామస్వామి, షైక్ హుసైన్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు పాపిన్ని మధుకిరణ్, లావుడ్యా మహేందర్, రామిశెట్టి6 నరేందర్, రావుట్ల నరేష్ చారి, రాయి సాయి, గుమ్మడి హరి, పొగుల నరేష్ తాళ్లూరి శ్రీను రాయి నాగరాజు తోట బాబు మరియు %జీూ=ాశీబ్ష్ర% నాయకులు తదితరులు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# ఇంటింటా ఇన్నోవేటర్ కు ఆవిష్కకర్తల నుండి దరఖాస్తులు ఆహ్వానం.

● జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 25,ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా వాక్ ఫర్ ఇన్నోవేషన్ ఆవిష్కర్తల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఆగస్టు 03 వ తేదీ వరకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనేవారు తమ వివరాలు పంపాలని ఆయన తెలిపారు. ఇంటింటా ఇన్నోవేటర్ కు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు ఆవిష్కరణల లో తమ ప్రతిభను చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమం చక్కని వేదికగా నిలుస్తుందని ఆయన అన్నారు.

ప్రజల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శనను నిర్వహించినున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొనడానికి అన్ని రంగాల, వర్గాల ప్రజల నుండి ఆవిష్కరణలను కోరడం జరుగుతుందని చెప్పారు. గ్రామీణ, విద్యార్థుల, వ్యవసాయ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమ ఆవిష్కరణలు మొదలగు వాటి ఆవిష్కరణలు పంపాలని కలెక్టర్ తెలిపారు.

ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణకు సంబంధించి 6 వాక్యాలు, 2 నిమిషాల వీడియోను, ఆవిష్కరణ యొక్క 4 ఫోటోలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నెంబర్, వయసు, ప్రస్తుత వృత్తి, గ్రామం, జిల్లా పేరు తదితర వివరాలను తెలియచేస్తూ 9100678543 సెల్ నంబర్ కు వాట్సాప్ చేయాలని చెప్పారు.

ఇన్నోవేటర్స్ నుండి దరఖాస్తులను స్వీకరించడానికి చివరి తేదీ ఆగస్ట్ 3 అని, వచ్చిన దరఖాస్తుల నుండి ఎంపిక చేసిన ఆవిష్కరణలు ఆగస్టు 15న ప్రదర్శనకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# రేషన్ బియ్యం పట్టివేత.





● సిద్దారం నుండి భారీగా తరలుతున్న రేషన్ బియ్యం.
● కోళ్ళఫారాలకే సరుకంతా.
● పట్టిబడిన సరుకు 5 టన్నుల,50 క్వింటాళ్ళు,విలువ రూ.1లక్షా ,50వేలు
● వాహనం సీజ్ చేసిన పోలీసులు.

సీ కే న్యూస్ సత్తుపల్లి ప్రతినిధి మునిర్.అక్రమ సంపాదనకు అలవాటు పడిన ఓ ముఠా పేదల బియ్యాని రూ.7 నుండి రూ.10 కి కొని, ఆంధ్రా వ్యాపారులకు రూ.20.నుండి,రూ.23 వరకు డిమాండ్ ను బట్టి విక్రయిస్తుంది.ఇదేవిధంగా సోమవారం రాత్రి సిద్దారం నుండి ఓ ఐషర్ వాహనం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్.టి.ఆర్ జిల్లా,విస్సన్నపేట మండలం,పుట్రేల గ్రామంలో గల శాఖమూరి క్రిష్ణబ్రహ్మం,రామబ్రహ్మంలు నడుపుచున్న కోళ్ళఫారాలకు సుమారు 5టన్నుల,50 క్వింటాళ్ళ రేషన్ బియ్యాని తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు సత్తుపల్లి పోలీసులు పట్టుకున్నారు.ఆంధ్రాలోని కాకినాడ,రాజమండ్రి తదితర ప్రాంతాలకు బియ్యం రవాణపై ఆంధ్ర రాష్ట్రం ఉక్కుపాదం మోపటంతో అక్రమ సంపాదన ఆగిపోవటం, సిద్దారం కేంద్రంగా వ్యాపారం చేస్తున్న రేషన్ బియ్యం వ్యాపారుల నుండి గతంలో భారీగా బియ్యాన్ని కొనుగోలు చేసిన వారు ఆగిపోవటంతో ,అక్రమ సంపాధన ఆగిపోవటంతో తాత్కాలికంగా వీరు వేరే దారులను ఎంచ్చుకుని పుట్రేలకు దారి కట్టారు.ఈ ప్రాంతంలో కోళ్ళఫారాలు నడుస్తుంటాయి. ఆ ఫారాల యాజమన్యాలు కోళ్ళకు చీరునూక,మొక్కజొన్నలతో ఫీడింగ్ ఇచ్చి నాణ్యమైన గుడ్లను కోళ్ళనుండి తీస్తుంది.కాని అంత నాణ్యమైన మేత ఇవ్వాలంటే ఖర్చు తడిసి మోపెడవ్వటంతో ,తక్కువ ధరకు వస్తున్న రేషన్ బియ్యాన్ని దళారుల నుండి కొని ఫారాలలో భారీ యంత్రాల ద్వారా నూకలుగా మార్చి కోళ్ళకు అందిస్తుంది. దూరం తగ్గటం,డబ్బులు తక్షణమే లభిస్తుండటంతో సత్తుపల్లి, వేంసూరు,పెనుబల్లి,కల్లూరు ప్రాంతాలలోని వ్యాపారులు పుట్రేలకు దారి పడుతున్నారు. సోమవారం కూడా ఈ మాదిరిగానే రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుబడ్డారు.గతంలో వీరిపై నాలుగు కేసులు నమోదు చేశామని పౌరసరపరాల శాఖాధికారి సత్యనారాయణ తెలిపారు.పట్టుబడిన బియ్యాని ,బియ్యం తరలించటానికి ఉపయోగించిన వాహనం

ఏపి 39 యూఈ 3549 ను సీజ్ చేసి,నిందుతులైన డ్రైవర్ యండాలి ప్రకాష్, వ్యాపారి కంపా బాలాజి,కోళ్ళఫారం నిర్వాహకులు శాఖమూరి క్రిష్ణబ్రహ్మం,రామబ్రహ్మంలపై కేసు నమోదు చేశామన్నారు.

# పంట పొలాలకు నీళ్లు వదిలిన డాక్టర్ మట్టా దయానంద్.




సీ కే న్యూస్ సత్తుపల్లి ప్రతినిధి మునిర్.పెనుబల్లి మండలం లంకాసాగర్ ప్రాజెక్ట్ నుండి పుష్కలంగా వర్షాలు పడుతున్న తరుణంలో ప్రాజెక్ట్ లోని నీటిని పంట పొలాలకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ చేతుల మీదుగా తూములకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంట పొలాలకు నీళ్లు వదిలినరు.

ఈ తరుణంలో రైతులు పంట పొలాలకు నీరు అందటం తో ఆనందం వ్యక్తం చేసినరు.

ఈ కార్యక్రమం లో అధికారులు,పెనుబల్లి, వేంసూరు మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతు సోదరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతి లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్.

**– పొదెం వీరయ్య చైర్మన్, తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్.**



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జూలై 25,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల అభ్యున్నతి బడ్జెట్ అని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, ఏఐసీసీ మెంబర్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, భద్రాచలం మాజీ శాసనసభ్యులు పొదెం వీరయ్య ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో తెలంగాణ బడ్జెట్ కేటాయించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కుకి, మంత్రులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. తెలంగాణ బడ్జెట్ 2024- 25 డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారని, ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.2.75 లక్షలతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టారని తెలిపారు.

ఆరోగ్య శ్రీ పథకం కింద రూ. 10 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తామని ప్రభుత్వం తెలిపిందన్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీలో ఉన్న 1672 చికిత్సలలో 1375 చికిత్స లకు ప్యాకేజీ ధరలను సగటున 20 శాతానికి పెంచారని వీరయ్య వెల్లడించారు. ఇందులో 163 వ్యాధులను కొత్తగా చేర్చారని, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగిన డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును జారీ చేసే విధానాన్ని ప్రవేశపెట్ట నున్నట్టుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించటం అభినందనీయమన్నారు. త్వరలోనే ఈఎస్టీ ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

వైద్య ఆరోగ్య శాఖకు ఈ బడ్జెట్ లో రూ.11,468 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు, హైద్రాబాద్ రింగ్ రోడ్డుతో పాటు రీజినల్ రింగ్ రోడ్ కు రూ. 1,525 కోట్లు, పాతబస్తీలో మెట్రో విస్తరణకు రూ. 500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైల్ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్ కు రూ. 50 కోట్లు, జీహెచ్ఎంసీలో మౌలిక వసతులకు రూ. 3,065 కోట్లు,హెచ్ఎండీఏలో కూడా మౌలిక వసతుల కోసం రూ.500 కోట్లను, మెట్రో వాటర్ వర్క్స్ కు రూ.3,385 కోట్లు, హైడ్రా సంస్థకు రూ. 200 కోట్లు,హైద్రాబాద్ నగర అభివృ ద్ధికి రూ. 10 వేల కోట్లు, విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు రూ. 100 కోట్లు కేటాయించినట్లు వీరయ్య గారు వెల్లడించారు.

రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకానికి రూ. 723 కోట్లు కేటాయించినట్లు, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.723 కోట్లను కేటాయించిందని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు పేదలకు ఉచిత విద్యుత్ ను అందిస్తామని హామీ ఇచ్చిందని, ఈ పథకానికి ప్రభుత్వం రూ. 2,418 కోట్లను కేటాయించిందని తెలిపారు. రూ.2.91 లక్షల కోట్లతో తెలంగాణ బడ్జెట్ రూ. 2లక్షల 91 వేల 159 కోట్లతో తెలంగాణ బడ్జెట్ ను రేవంత్ సర్కార్ ఈరోజు అసెంబ్లీలో ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు. మూలధన వ్యయం రూ.33 వేల 487 కోట్లుగా ఉందని,రెవిన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లుగా ఉందని డిప్యూటీ సీఎం బట్టి పేర్కొన్నట్లు వీరయ్య వెల్లడించారు. ఇది సంక్షేమ ప్రభుత్వమని, ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని వీరయ్య గారు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తోందన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని వీరయ్య వెల్లడించారు

## దాతృత్వం చాటుకున్న ఏనుగు రవీందర్ రెడ్డి

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత




సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) జూలై 25:చౌటుప్పల్ మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన ఊదరి ఎల్లమ్మ నిన్న సాయంత్రం అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఇట్టి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి ఏనుగు రవీందర్ రెడ్డి 4000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఇట్టి ఆర్థిక సహాయం ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఊదరి శ్రీనివాస్ చేతులమీదుగా మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊదరి పోషయ్య, బద్రి పోశయ్య, దాసరి లింగయ్య,యువజన కాంగ్రెస్ నాయకులు ఊదరి రవి, దాసరి శేఖర్, దాసరి శివకుమార్, బద్రి ఉపేందర్, ఊదరి శివశంకర్, ఊదరి వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొల్లాపూర్ "పీజీ" సెంటర్ లో ఫేర్వెల్ డే



**సీకే న్యూస్ ప్రతినిధి, కొల్లాపూర్:** కొల్లాపూర్ పట్టణ పరిధిలోని పీయు పీజీ సెంటర్ లో గురువారం కళాశాల మొదటి సంవత్సర విద్యార్థుల ఆధ్వర్యంలో రెండవ సంవత్సరం పూర్తి కావొస్తున్న సీనియర్ లకు ఘనంగా ఫేర్వెల్ డే నిర్వహించారు అనంతరం సీనియర్స్ మాట్లాడుతూ మొదటి సంవత్సర విద్యార్థులకు వారు ఎదుర్కొన్న సమస్యలను కళాశాలలో పాటించాల్సిన పలు సూచనలు వారికి తెలిపారు అలాగే కళాశాల ప్రిన్సిపల్ మార్క్ పొలోనియస్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో మంచి చదువును స్వీకరించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు స్పీచ్ అనంతరం జూనియర్స్ సీనియర్స్ ఉపాధ్యాయులు అందరూ కలిసి సంతోషంగా డాన్సులు చేస్తూ ఆనందంగా గడిపారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మార్క్ పొలోనియస్ అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## పూల మొక్కలను నాటి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ నాయకులు.

- ఉమా సోమలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు.



**సీకే న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాదావత్తు హోథిరాం నాయక్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గం జూలూరుపాడు మండల పరిధిలోని పాపకొల్లు గ్రామం నందు గల శ్రీ ఉమా సోమలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్ ఆధ్వర్యంలో ఈరోజు లివైరా నియోజకవర్గ శాసనసభ్యులు,మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు రకాల పూల మొక్కలను నాటి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిమ్మటూరి ముత్తయ్య, మండల సేవాదళ్ కార్యదర్శి నరుకుల ఆదినారాయణ, కొండేం వీరభద్రం, బాదావత్ రమేష్, బాదావత్ సామ్య, అప్పికట్ల పుల్లయ్య, ధర్మరాజుల సత్యనారాయణ, వాంకుడోత్ లచ్చిరాం, బాదావత్ సాయి, శెట్టి రంగారావు, వాంకుడోత్ సామ్య, బాదావత్ నర్సింగ్, కడియాల మని, అజ్మీర కుమార్, గూగులోత్ మోహన్, వాంకుడోత్ బాబూలాల్ మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ 6 వ మండల మహా సభ జయప్రదం కొరకు విస్తృత ప్రచారం

- కార్మికుల సంక్షేమ చట్టాలు ఏర్పాటు చేయాలి,,,
- ఏఐటీయూసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుల కంచర్ల జమలయ్య



**సి కే న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాధావత్ హోథిరాం నాయక్**
భ%ఖ%ద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించి కార్మిక చట్టాలను ప్రైవేట్ పరం చేసి అంబానీ ఆదానీలకు ఊడిగం చేస్తున్నారని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య విమర్శించారు ఈనెల 29న జూలూరుపాడులో ఆరవ మహాసభ విజయవంతం కోసం విస్తృతంగా ప్రచారము నిర్వహించారు చంద్రుగొండ, పాపకొల్లు, ఆటో అడ్డాల్లో మహాసభల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ గా మార్పులు చేసి దేశంలో కార్మికులకు దేశ ప్రజలకు ఎలాంటి రక్షణ లేకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు హమాలి బిల్డింగ్ వర్కర్స్ గ్రామపంచాయతీ అంగన్వాడి ఆశ మిడ్ డే మీల్స్ సెకండ్ ఏఎన్ఎం సమస్యలను పరిష్కరించాలని ఈ నేపథ్యంలో జరగనున్న మండల మహాసభకు పెద్ద ఎత్తున కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు మాచర్ల శీను పిడుగు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు గార్లపాటి వీరభద్రం వల మల్ల సామేలు మల్కం వీరభద్రం, ఎస్కే బుడెన్ పాష నేలాల నవీన్ సాయిరాం కత్తి సాయి తదితరులు పాల్గొన్నారు

## నూతన ఈవో కృష్ణారావుకు సన్మానం



**తల్లాడ జులై 25 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్ :** తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టిన సిహెచ్. కృష్ణారావును గురువారం తల్లాడ మేజర్ పంచాయతీ మాజీ ఈడీసీ చైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా తల్లాడ గ్రామపంచాయతీ అభివృద్ధికి ఆయన కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దగ్గుల భద్రారెడ్డి. దగ్గుల రాము, పంచాయతీ సిబ్బంది వేలాద్రి ,చాంద్, శ్రీకాంత్, జర్నలిస్టులు గుడిపల్లి నారాయణ, ఎండి బహుదూర్ తదితరులు పాల్గొన్నారు.

# వరుస కథనాలతో స్పందించిన మిర్యాలగూడ ఎమ్మెల్యే...బత్తుల లక్ష్మారెడ్డి





- భీమారం సూర్యాపేట రహదారిపై తాత్కాలిక మరమ్మత్తులు

**సీకే న్యూస్ వేములపల్లి జులై 25 :** సూర్యాపేట ప్రధాన రహదారిపై గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రధాన రహదారి గుంతల మయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో వివిధ పత్రికలలో ప్రచురితమైన వార్తలతో స్పందించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి(%దీూ=)=ఒదీ% అధికారులను సంప్రదించి గురువారం రోడ్డు మరమ్మత్తు తాత్కాలిక పనులలో భాగంగా మట్టి మరియు బీటీ ఏర్పాటు దగ్గరుండి మరమ్మత్తు పనులను పర్యవేక్షించి అధికారులకు చూచనలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మడబోయిన అర్జున్, బీరవోలు సతీష్ రెడ్డి,సందీప్ మరియు కాంగ్రెస్ నాయకులు %దీూ=% బ్రదర్స్ పాల్గొన్నారు

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు..

**యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ..**

**సీకే న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాదావత్తు హోథిరాం నాయక్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం: వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన్ని పురస్కరించుకొని జూలూరుపాడు యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూలూరుపాడు ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు పండ్లు,బెడ్ ప్యాకెట్లు అందజేశారు,అనంతరం జూలూరుపాడు అంబేద్కర్ సెంటర్ లో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు, వారు మాట్లాడుతూ వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మలోత్ రాందాస్ నాయక్ గారు ఎంతగానో కృషి చేస్తున్నారు , ఆయన ఆయురారోగ్యాలతో దేవుడు కృప ఎల్లప్పుడూ ఉండాలని



యూత్ కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు షేక్. షఫీ,మండల యూత్ కాంగ్రెస్ నాయకులు కల్లోజి దినేష్,నవీన్,అజేయ్,వంశీ,సమీర్,తదితరులు పాల్గొన్నా రు.

# నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో సిటీ స్టైల్ జిమ్ కు నాలుగు బంగారు పతకాలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్),జూలై 25,** ఈనెల 21 నుండి 25 వరకు మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కు చెందిన గాలి రామ్మోహన్రావు అనే 72 సంవత్సరాల క్రీడాకారుడు 4 బంగారు పతకాలు సాధించినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బెంచ్ ప్రెస్ పోటీలలో 105 కేజీల విభాగంలో 80 కేజీల బరువెత్తి బంగారు పతకం సాధించారు.,స్క్వాట్స్ 105 కేజీల విభాగంలో 100 కేజీ ల బరువెత్తి బంగారు పతకం సాధించారు. డెడ్ లిఫ్ట్ 105 కేజీల విభాగంలో 130 కేజీల బరువెత్తి బంగారు పతకం సాధించారు. అంతేకాకుండా పవర్ లిఫ్టింగ్ అంటే( బెంచ్ ప్రెస్,, స్క్వాట్, డెడ్ లిఫ్ట్ ) ఈ మూడు కలిపితే పవర్ లిఫ్టింగ్ దీనిలో కూడా టోటల్ గా 310 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం సాధించడం జరిగింది. గతంలో కూడా గాలి రామ్మోహన్రావు ఎన్నో జాతీయ స్థాయి పోటీలలో బంగారు పథకాలు సాధించారు. అంతేకాకుండా పోయిన సంవత్సరం విజయనగరం రాజాంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో నేషనల్ రికార్డును తిరగ రాయడం జరిగింది. అప్పుడు ఆయన 70 కేజీలు చేసి రికార్డు తిరగరాయగా మళ్లీ ఆయన 70 కేజీల రికార్డును ఇప్పుడు 80 కేజీలు చేసి మళ్లీ కొత్త రికార్డును తిరగరాశారు. ఈ సందర్భంగా గాలి రామ్మోహన్ రావు మాట్లాడుతూఈ విజయం భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి ఇచ్చిన కఠోర శిక్షణ వలనే సాధ్యమైందని తెలిపారు. గెలుపొందిన గాలి రామ్మోహన్రావును పవర్ లిఫ్టింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్ , పట్టణంలోని క్రీడా సంఘాలు, పలువురు రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి అసోసియేషన్ సభ్యులు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు నేషనల్ పవర్ లిఫ్టర్ మహంతి వెంకటకృష్ణాజి , పట్టణ సంఘ సేవకులు గాదె మాధవరెడ్డి, మరియు సిటీ స్టైల్ జిమ్ సభ్యులు అభినందించారు.

## తెలంగాణ 24 -25 వార్షిక బడ్జెట్

# జన రంజకమైన ప్రజా బడ్జెట్



**సీ కే న్యూస్ చేగుంట జులై 25 రిపోర్టర్ ( కొండి శ్రీనివాస్.)** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్" 2024-25 జన రంజకమైన ప్రజా బడ్జెట్ "అని మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ కొనియాడారు బడ్జెట్లో అభివృద్ధి ,సంక్షేమ రంగాలకు సమ ప్రాధాన్యత నిస్తూ బడ్జెట్ను ప్రవేశపెట్టిన తీరు అభినందనీయమన్నారు వ్యవసాయం ,సంక్షేమ రంగాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరు గ్యారంటీలకు బడ్జెట్లో తగిన ప్రాధాన్యత నివ్వడం శుభసూచకం అన్నారు ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్రంలో భూమిలేని నిరుపేద కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు అందించడం హర్షనీయమన్నారు సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ గా 500 చెల్లించడం మంచి నిర్ణయం అన్నారు జనరంజకమైన ప్రజా బడ్జెట్ 2024-25 ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖ మాత్యులు బట్టి విక్రమార్క కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఈ సందర్భంగా బుడ్డ భాగ్యరాజ్ ఉమ్మడి మెదక్ జిల్లా తరపున కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.

# ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**రాఘవేంద్ర కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, నోబుల్ పార్క్ కాలనీ**

**అధిక సంఖ్యలో పాల్గొన్న కాలనీవాసులు**

**సి కే న్యూస్ : జూలై 25:** షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, నోబుల్ పార్క్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, ప్రజలు గురువారం రోజు పోచమ్మ తల్లికి శివసత్తుల విన్యాసాలు పోతురాజుల ఆట పాటలతో కాలనీవాసులు బోనాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నోబుల్ పార్కు ఆఫీసర్స్ కాలనీ రాఘవేంద్ర కాలనీ భాగ్యనగర్ కాలనీ ప్రజలతో పాటు చుట్టుపక్కల కాలనీవాసులు కుడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## మిట్టపల్లి లో ప్రత్యేక వైద్య శిబిరం



**తల్లాడ జులై 25 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్ ::** ఖమ్మం జిల్లా: వైద్య ఆరోగ్యశాఖ "ఆదేశాల "మేరకు తల్లాడ మండలం (పాత )మిట్టపల్లి గ్రామం,ఎస్సీ కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమంలో తల్లాడ పీహెసీ డాక్టర్ రత్న మనోహర్, హెచ్ వి వసంత ఎమ్మెల్ హెచ్ పి / సిహెచ్ఓ ఎన్. రాజశ్రీ ఎం పి హెచ్ ( ఎఫ్)పద్మ , పాల్గొన్నారు ఈ సందర్భంగా ,వారు మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలకు ఎక్కువగా డెంగ్యూ, మలేరియా,విష జ్వరాలు వంటి వ్యాధులు, ప్రబలకుండా "అప్రమత్తంగా" ఉండాలని దోమ కాటు వల్ల రోగాలు వస్తాయని,ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడం ద్వారా నీటిని వేడి చేసి" త్రాగడం "వలన వ్యాధులను నివారించుకోవచ్చునని , మురికి "నీరు" నిల్వ లేకుండా, చూడాలని, ప్రజలకు ఆరోగ్యం" పై "అవగాహన కల్పించారు అంతేకాకుండా రోగులకు, బిపి, షుగర్,రక్త పరీక్ష నిర్వహించి మందులు "పంపిణీ "చేశారు ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, విజయ శాంతకుమారి,భద్రమ్మ సుధా ప్రజలు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన వైరా 6టీవీ జర్నలిస్ట్ జీ. ప్రశాంత్ (చెర్రీ)..





**తల్లాడ జులై 25 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్ :** వైరా నియోజకవర్గ 6టీవీ రిపోర్టర్ జి ప్రశాంత్ (చెర్రీ) రక్తదానం చేశారు వైరా శాసనసభ్యులు మాలోతు రాందాసు నాయక్ జన్మదినం సందర్భంగా వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ప్రశాంత్ రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ గతంలో కూడా అనేకసార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదినం సందర్భంగా రక్తదానం చేయడం సంతోషంగా ఉంది అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు పమ్మి అశోక్ ,జిల్లా నాయకులు కోసూరి శ్రీను, కర్నాటి హనుమంతరావు ,మహేష్ పలువురు పాల్గొన్నారు

# సరిహద్దుల వెంట నిఘా పటిష్ఠం చేయాలి







- వచ్చి పోయే ప్రతిఒక్క వాహనాన్ని తనిఖీ చేయాలి
- అక్రమ గంజాయి,రేషన్ బియ్యాన్ని అరికట్టాలి
- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి (రామయ్య) జూలై 25** :మట్టపల్లి కృష్ణానది పై ఎర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర, జిల్లాల చెక్ పోస్ట్ ను సూర్యాపేట జిల్లా ఎస్పీ సంప్రీత్ సింగ్ గురువారం పరిశీలించారు. మఠంపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీలో భాగంగా ముందుగా అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ ను పరిశీలించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సరిహద్దుల వెంట నిఘా గట్టిగా పటిష్టం చేయాలని వచ్చి పోయే ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అక్రమ గంజాయి రేషన్ బియ్యాన్ని అరికట్టాలని బ్రిడ్జి మీదుగా వచ్చిపోయే ప్రతి ఒక్క వాహనాన్ని వాటి నెంబర్ ను రికార్డుల్లో నమోదు చేయాలని అదేవిధంగా చెక్పోస్ట్ వద్ద ఉంటున్న పోలీసులకు ఏర్పాటుచేసిన పోస్ట్ రూమ్ ను పరిశీలించి నివాసయోగ్యంగా ఉండేలా ఇంకా మీకు ఏమైనా అవసరాలు ఉంటే స్థానిక ఎస్సై కు తెలియజేయాలని సూచించారు, అనంతరం మఠంపల్లి పోలీస్ స్టేషన్ కు వెళ్లి పరిసరాలు పరిశీలించి,పోలీస్ స్టేషన్ పరిధిలో నేర ప్రవృత్తి తెలుపు మ్యాపులు,మండల భౌగోళిక స్థితిగతులు,సరిహద్దు పరిస్థితులు, హిస్టరీ షీట్స్ గురించి అయా పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ నందు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బందిని సమర్థవంతంగా ఉపయోగించాలని అన్నారు. హుజూర్ నగర్ సర్కిల్ కు ఆంధ్రా సరిహద్దు ప్రాంతం,కృష్ణా బేసిన్ ఎక్కువగా ఉన్నది ఎల్లప్పుడూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్ కు వచ్చే ప్రతి పిర్యాదుదారులకు కనీస సౌకర్యాలు కల్పించి,వారితో మర్యాదగా ప్రవర్తించి సహాయ సహకారాలు అందించాలన్నారు. పాత నేరస్తులపై,గంజాయి సంభందిత కేసుల్లో ఉన్న నేరస్తులపై, నిందితులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలనీ గంజాయి మూలాలు లేకుండా నివారించడం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీధర్ రెడ్డి, సీఐ చరమంద రాజు, మఠంపల్లి ఎస్సై రామాంజనేయులు, హుజూర్నగర్ ఎస్సై ముత్తయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం .

- ప్రధానోపాధ్యాయురాల్లు
- సలోమి. మమత. మానస



**సి కె న్యూస్ చేగుంట జులై 25 రిపోటర్ ( కొండి శ్రీనివాస్ )**చేగుంట మండల్ కరీంనగర్ పాఠశాలలో సహజ బదిలీలో భాగంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను అలాగే నూతనంగా వచ్చిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను నేడు పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు, ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన సర్వీస్ లో ఒకచోట నుండి మరొక చోటుకు బదిలీ కావడం సహజం కానీ ఉపాధ్యాయ వృత్తిలోఉపాధ్యాయడు ప్రతి విద్యార్థులు మనసులో ఉంటారు,అని అన్నారు ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు సలోమి, మమత, మానస .జగన్ లాల్, పెంటగౌడ్, కృష్ణమూర్తి, విజేందర్ రెడ్డి, వాణి, సంధ్య రాణి, సునీత, మరియు విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ కార్మికుడు 'దుర్గాప్రసాద్'కు మెరుగైన వైద్యం అందించాలి.

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 25,** కొత్తగూడెం : విద్యుత్ ప్రమాదంలో గాయపడిన కొత్తగూడెం మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుడు దుర్గాప్రసాద్ కు మెరుగైన వైద్యం అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కోరారు. పట్టణం లోని ఎసిబి నగరులో విధులు నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్ విద్యుత్ ప్రమాదం సంభవించి గాయాల పాలు కావడంతో సంబంధిత మున్సిపల్ శాఖకారులు, వైద్యశాఖ అధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విధినిర్వహిణ లో ప్రమాదం చోటుచేసుకోవడం దురదుష్టకరమని, జరిగిన సంఘటపై విచారణ జరిపి భాద్యుల పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తిగా కోలుకునే వరకు మున్సిపల్ శాఖ అధికారులు పర్యవేక్షించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సహకారం అందించాలని కోరారు. కుటుంబానికి అర్థిక సాయం అందించాలని కోరారు. దుర్గాప్రసాద్ ను పరామర్శించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు గెద్దాడు నగేష్, నేరెళ్ల రమేష్ తదితరులు వున్నారు.

## తెలంగాణ 24 -25 వార్షిక బడ్జెట్ జన రంజకమైన ప్రజా బడ్జెట్



**సీ కే న్యూస్ చేగుంట జులై 25 రిపోర్టర్ ( కొండి శ్రీనివాస్.)** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్" 2024-25 జన రంజకమైన ప్రజా బడ్జెట్ "అని మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుద్ద భాగ్యరాజ్ కొనియాడారు బడ్జెట్లో అభివృద్ధి ,సంక్షేమ రంగాలకు సమ ప్రాధాన్యత నిస్తూ బడ్జెట్ను ప్రవేశపెట్టిన తీరు అభినందనీయమన్నారు వ్యవసాయం ,సంక్షేమ రంగాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరు గ్యారంటీలకు బడ్జెట్లో తగిన ప్రాధాన్యత నివ్వడం శుభసూచకం అన్నారు ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్రంలో భూమిలేని నిరుపేద కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు అందించడం హర్షనీయమన్నారు సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ గా 500 చెల్లించడం మంచి నిర్ణయం అన్నారు జనరంజకమైన ప్రజా బడ్జెట్ 2024-25 ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖ మాత్యులు బట్టి విక్రమార్క కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఈ సందర్భంగా బుద్ద భాగ్యరాజ్ ఉమ్మడి మెదక్ జిల్లా తరపున కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.

## వైరా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన దొండపాటి వాసు



**సీకే న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాధావత్ హాతిరాం నాయక్:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గ జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన దొండపాటి వాసు (శ్రీనివాస్) గురువారం హైదరాబాదులో వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించి, మిఠాయిలు తినిపించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గంలో తొలిసారి పోటీ చేసిన మాలోతు రాందాస్ నాయక్ ఓట్ల మెజారిటీలో చరిత్ర సృష్టించారని, రాందాస్ నాయక్ సాధించిన మెజారిటీ వైరా నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, వైరా ఎమ్మెల్యే మాజోత్ రాందాస్ నాయక్ నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని, అందేవిధంగా వైరా నియోజకవర్గ పోడు రైతుల సమస్యలను తీర్చడంలో ముందున్నారని ప్రశంసించారు.

# వర్షాలు సరిగా కురవక రైతన్న ఇక్కట్లు

- సాగర్ నీటితో చెరువులు నింపాలి
- బేత శివారెడ్డి, రైతు, మఠంపల్లి



**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య జూలై 25:**వర్షాలు సకాలంలో కురవక రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని
నాగార్జునసాగర్ నీటితో ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపాలని మఠంపల్లి మండలానికి చెందిన రైతు బేత శివారెడ్డి డిమాండ్ చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని చెరువులు పూర్తిగా ఎండిపోయి రైతుల బోరు బావుల్లోని నీటి మట్టాలు పూర్తిగా పడిపోయాయన్నారు. దీంతో గ్రామాల్లోని ప్రజలకూ తాగునీటి ఇబ్బందులు గురవుతున్నాయని, అరకొర వర్షాలకు చెరువుల్లోకి చుక్కనీరు కూడా చేరడం లేదన్నారు. గ్రామాల్లోని ఉర చెరువులను సాగర్ నీటితో నింపితే భూమిలో ఊటనిలువలు పెరిగి ప్రజలకు, పశుపక్షాదులకు ఊరట కలిగించినట్లు అవుతుందని, ఇప్పటికే ఖమ్మం జిల్లా తాగునీటి అవసరాల కోసం సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తున్నప్పటికీ హుజూర్నగర్ నియోజకవర్గానికి ఉన్న తాగునీటి సమస్యని దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే నీటిని విడుదల చేయాలని వారు కోరారు.

## పోగొట్టుకున్న చెన్ తిరిగి బాధ్యతరాలకి అందజేత




**సీ కే న్యూస్ సత్తుపల్లి ప్రతినిధి మునిర్.**పోగొట్టుకున్న చైన్ తిరిగి బాధ్యతరాలకి అప్పగించిన సంఘటన సత్తుపల్లిలో చోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే, సత్తుపల్లి మండలం పరిధిలోని యాతాలకుంట గ్రామానికి చెందిన వాసం సంధ్య మీనా కుమార్ భార్యాభర్తలు ఇద్దరు గురువారం మధ్యాహ్నం వారి ఇంటి అవసరాల నిమిత్తం వారి వద్ద ఉన్న 16 గ్రాముల 1,50,000 విలువచేసే చైన్ తాకట్టు పెట్టేందుకు సత్తుపల్లి కి రాగా పాత బస్టాండ్ సమీపంలో వెంకట్ ఫోటో స్టూడియోలో ఫోటో దిగేందుకు వెళ్లగా పొరపాటున హ్యాండ్ బ్యాగ్ లో ఉన్న చైన్ జారిపోయింది దీంతో బాధితులు దిక్కు తోచని స్థితిలో ఉండగా ఫోటో స్టూడియో నిర్వాహకుడు వెంకట్ ఆయన స్నేహితులు ఆర్యవైశ్య సంఘం యువజన నాయకులు బచ్చు చిన్న వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి కమల్ బాషా తో కలిసి బాధ్యతరాలకి అందజేశారు, చైన్ అప్పగించినందుకు బాధ్యత కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## గిరిజన బిడ్డపట్ల మానవత్వం చాటుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు: డాక్టర్. పీటర్ నాయక్ లకావత్



**సీ కే న్యూస్** వివరాల్లోకి వెళ్ళితే సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గోనేనాయక్ తండాకు చెందిన విద్యార్థిని బాదావత్ మధులత అనే విద్యార్థిని జేఈఈలో ర్యాంకు ద్వారా పాట్నా ఐఐటీలో సీటు సాధించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆమెకు
ప్రజా ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ నేపథ్యంలో 'ఐఐటీకి వెళ్లలేక....మేకల కాపరిగా' అనే శీర్షికతో వార్తాపత్రికల్లో వచ్చిన కథనంపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ పేదింటి చదువులతల్లికి తక్షణమే సహాయం అందించాల్సిందిగా అధికారులను జరిగింది. సీఎం ఆదేశాల మేరకు గిరిజన శాఖ అధికారులు విద్యార్థిని మధులత వివరాలు తెలుసుకొని మాట్లాడి, వారి కుటుంబాన్ని బుధవారం హైదరాబాద్ కు తీసుకువచ్చారు.
సచివాలయంలో గిరిజన శాఖ కార్యదర్శి శరత్ ద్వారా విద్యార్థిని మధులతకు రూ 1,51,831 చెక్కును అందజేశారని తెలుసుకున్న ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సమితి డాక్టరేట్ అవార్డు గ్రహీత పీటర్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ %ఛ% ఫౌండర్ మరియు నేషనల్ నింబుల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సీనియర్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ క్రమములో డాక్టర్ పీటర్ నాయక్ మాట్లాడుతూ, ఇదే తరహాలో ఆణిముత్యంల అన్ని తెలివితేటలు ఉండియుకూడా కేవలం ఆర్థిక సహాయంలేక ఎందరో గిరిజన యువతీ యువకులు తెలంగాణ రాష్ట్రములో బాధపడుతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. కాబట్టి తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వంలో అణగారిన నిరుపేద విద్యార్థులపట్ల ప్రత్యేకంగా దృష్టి సారించాలని డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ సూచించారు.
అనంతరం షెడ్యూల్ ట్రైబల్ కో-ఆపరేటివ్ ఫైనాన్షియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్) ఛైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ మరియు గిరిజన శాఖ అధికారులకు డాక్టర్ పీటర్ నాయక్ ధన్యవాదములు తెలిపారు.

## చేగుంట ఈనాడు జర్నలిస్ట్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా





**సి.కే న్యూస్ చేగుంట జులై 25 రిపోటర్ ( కొండి శ్రీనివాస్ )**
చేగుంట మండల్ కరీంనగర్ గ్రామంలో ఈనాడు ప్రతినిధి సురేందర్ పుట్టినరోజు వేడుకలు జగన్ లాల్
పెంటగౌడ్. అధ్యక్షతన కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. జగన్ లాల్ మాట్లాడుతూ. ఈనాడు జర్నలిస్టుగా కొనసాగుతున్న మీరు మరెన్నో విజయ తీరుకు వెళ్లాలని ఆశిస్తూ ఇలా ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు మీకు మరొకసారి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున . ఈ జన్మదినం వేడుకలో పాల్గొన్న జర్నలిస్టులు.
మన తెలంగాణ రిపోర్టర్. రఘు రాములు. నమస్తే తెలంగాణ రిపోర్టర్.చలపతి. సాక్షి. రిపోటర్.వీరేశం. న్యూస్ తెలంగాణ రిపోటర్.
శ్రీనివాస్. మరో కిరణాలు రిపోటర్ .కొండి శ్రీనివాస్ . తేజ న్యూస్ రిపోర్టర్ , స్టాలిన్ నర్సింలు జనం న్యూస్ రిపోర్టర్.ఆంజనేయులు. విజయ క్రాంతి రిపోటర్ ఎండి ముజామిల్ .సూర్య రేక రిపోటర్ .అన్నం మహేష్. కాంగ్రెస్ పార్టీ . మండల్ ఉపాధ్యక్షుడు .మాసాయిపేట శ్రీను. తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర బడ్జెట్లో ఏపీకి వరాల జల్లు మోడీ చిత్రపటానికి పాలాభిషేకం.





**పోలవరం సీ కే న్యూస్ :** కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు వరాలజల్లు ప్రకటించడంపై కూటమి నాయకుల ఆధ్వర్యంలో పోలవరం లోని ఏటిగట్టు సెంటర్ వద్ద ప్రధానమంత్రి మోడీ చిత్రపటానికి కేక్ కట్ చేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ లోక్ సభ లో ప్రవేశపెట్టడం జరిగిందని. ఏపీకి 15 వేల కోట్లు నిధులతో పాటు రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.ఏపీకి ప్రత్యేక సహాయం అందించిన ప్రధానమంత్రి మోడీ కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ కార్యవర్గ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి, జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, మహిళ మోర్చా అధ్యక్షురాలు బొలినేని నిర్మల కిషోర్, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మాలతి రాణి, జనసేన మండల అధ్యక్షులు గుణపర్తి చిన్ని, జనసేన సీనియర్ నాయకులు కొణతాల ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు కుంచే దొరబాబు, బిజెపి నాయకులు కరి బండి నాగరాజు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి వరద ఉధృతితో బోటు ప్రయాణాలు రద్దు.





**పోలవరం సీ కే న్యూస్ :** ఎగువ ప్రాంతాల్లో రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద నీరు వచ్చి చేరడంతో నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుత సీజన్లో మొదటిసారి గోదావరికి వరద తాకిడి మొదలైంది. మరోవైపు ఎగవు నుండి మరింత వరద నీరు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వచ్చిన వరద నీరు దేవీపట్నం మండలంలోని గండి పోచమ్మ గుడిలోకి నీరు చేరడంతో ఆలయ రాకపోకలు పూర్తిగా నిలుపుదల చేశారు. ఇప్పటికే పాపికొండలు టూరిజం బోట్ల రాకపోకలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. మూడు నెలల తర్వాతే గాని పర్యాటక బోర్డులు గోదావరిలో తిరిగే పరిస్థితి ఉండదు.

గోదావరి నదిపై సాగే పాపికొండల విహార యాత్ర పర్యాటకుల్ని ఎంతగానో ఆకట్టుకునే విధంగా ఉంటాయి. ఈ విహార యాత్రకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అలాగే ఇతర రాష్ట్రాల పర్యాటకులు కూడా పాపికొండల పర్యటకానికి వస్తుంటారు. గోదావరి నదిపై లాంచీలో ప్రయాణం ఉంటుంది. అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ,ప్రైవేటు బోట్ల విహారయాత్ర పై త్వరలో నిర్ణయం తీసుకుంటారు.

## కోటవురట్ల గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి




**కోటవురట్ల, సీ కే న్యూస్ :**గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని నర్సీపట్నం డీఎల్పీవో మూర్తి అన్నారు. కోటవురట్ల పంచాయతీ పరిధిలో ముస్లిం వీధిలో స్థానిక ఎంపీటీసీ పీవీ సూర్యారావు ఆధ్వర్యంలో
గురువారం పారిశుధ్యం పరిశుభ్రత కార్యక్రమాన్ని
నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మూర్తి
మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుదా భాష, కాశీం, సూర్య కుమారి పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ మార్క్ పరిపాలనకు ముక్కుతాడు వేసిన ఎన్డీఏ పక్షాలు

- కేంద్ర బడ్జెట్లో బీహార్,ఆంధ్రప్రదేశ్ కు పెద్దపీట వేసి తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీ.
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి




**సీ కే న్యూస్ :**పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి ప్రజలు చెక్ పెట్టి,నరేంద్ర మోడీ మార్క్ పరిపాలనకు ఎన్డీఏ పక్షాలు ముక్కుతాడు వేశాయని అందుకే కేంద్ర బడ్జెట్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి తెలంగాణ రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి మండిపడ్డారు.

గురువారం గణేష్ నగర్ బైపాస్ రోడ్డులో గల ఎల్ఐసి ఏజెంట్ల సంఘం భవనంలో రెండు రోజులపాటు జరగనున్న సీపీఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ శిక్షణ శిబిరాలను చాడ వెంకటరెడ్డి ప్రారంభించారు

శిక్షణా శిబిరాలకు సీపీఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అధ్యక్షత వహించారు

శిక్షణా శిబిరాల ప్రారంభ సూచికగా ఏర్పాటు చేసిన సీపీఐ పతాకాన్ని సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆవిష్కరించారు

ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో బిజెపి పట్ల ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత పెరిగిపోతుందని, గత రెండు పర్యాయాలు కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం, నిరుద్యోగాన్ని నిర్మూలించకపోవడం,నల్లధనం వెనక్కు తీసుకురాక పోవడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పెట్టుబడి దారులకు, కార్పోరేట్ శక్తులకు ధారాదత్తం చేయడం,44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజించి కార్మిక హక్కులను కాలారాయడం, చేయడాన్ని దేశ ప్రజలు గమనించి పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పారని, ఎన్డీఏ పక్షాల మద్దతుతో మూడోసారి మోడీ ప్రధానమంత్రి అయ్యారని అయినా మోడీ తీరులో మార్పు లేదని,ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను మోడీ విస్మరించి బడ్జెట్లో ఆయా రాష్ట్రాలకు నిధులు ఇవ్వకపోవడం అత్యంత దుర్మార్గమని, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఈ దేశంలో అంతర్భాగం కావా అని వెంకటరెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ తో పాటు బీజేపి ఎంపీలకు బడ్జెట్ కేటాయింపులు కనిపించడం లేదా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయని వీరిని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు


నీళ్లు,నిధులు, నియామకాల ప్రాతిపాదికన ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి 10 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కెసిఆర్ పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి ప్రశ్నించే గొంతుకలను అణచివేశారని, తెలంగాణ లో ఆత్మగౌరవ పరిపాలన కొనసాగలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అనేక అవినీతికి ఆజ్యం పోసారని,వాటిపై ఆత్మ విమర్శ చేసుకోకపోగా నేడు ఎల్ఎండి,మేడిగడ్డ ప్రాజెక్టుల పర్యటన చేయడమెంటని, ఎస్సీ,బీసీ సబ్ ప్లాన్ లను నిర్వీర్యం చేశారని,భూ సమస్యలు పరిష్కరించలేదని, కేసీఆర్ వైఖరి పట్ల ప్రజలు విసిగి వేసారి గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని చాడ తెలిపారు

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యంత్రి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని,ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకోవడం కాదు ప్రజాపాలన సక్రమంగా నిర్వహించి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినప్పుడే ప్రజల విశ్వాసం పొందుతారని,అర్హులకు ఇండ్ల స్థలాలు,ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు తక్షణమే అందించాలని, ఫీజు రీయంబర్స్మెంట్,స్కాలర్ షిప్స్ ఇవ్వాలని,ధరణి పోర్టల్ లో ఉన్న లొసుగులు సవరించి రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి చాడ వెంకటరెడ్డి సూచించారు.

అశేష పోరాటాలు త్యాగాలకు త్యాగాల గణనీయమైన చరిత్ర గల భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆవిర్భవించి డిసెంబర్ 25 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్నదని,100 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల చరిత్రలో నిరంతరం కార్మికులు, కర్షకులు,ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఏజెండాగా ముందుకు సాగుతూ నాటి నుండి నేటి వరకు సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అనేక ఉద్యమాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించిన మహోజ్వల పోరాటాల చరిత్ర సిపిఐ కి మాత్రమే ఉన్నదని,అలాంటి సీపీఐ లో పనిచేస్తున్న నాయకులు,కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు రాజకీయంగా చైతన్యం కావడానికి, పార్టీ ప్రజా సంఘాలను గ్రామ స్థాయి నుండి మరింత బలోపేతం చేసుకోవడం కోసం ఈ రాజకీయ శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆ దిశ గా సీపీఐ శ్రేణులు సంసిద్ధం కావాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.

ఈ రాజకీయ శిక్షణ శిబిరాలలో కరీంనగర్ సిద్దిపేట రాజన్న సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి,మంద పవన్,గుంటి వేణు,తాంద్ర సదానందం,వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గడిపె మల్లేష్ ,గోషిక మోహన్,కసిరెడ్డి మణికంఠ రెడ్డి సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు తోపాటు ఐదు జిల్లాలకు చెందిన గ్రామ శాఖ కార్యదర్శిలు,జిల్లా కౌన్సిల్ సభ్యులు,ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు

# మాట తప్పని మున్సిపల్ చైర్మన్



**పెబ్బేరు జూలై25 (సి కే న్యూస్)**ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఇనాం భూమిని సాగు చేస్తున్న వారికి పట్టా చేయిస్తానని ఇచ్చిన మాట కట్టుబడి వారి వారసులకు పట్టా పాస్ పుస్తకాలు మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ గురువారం వారి నివాసంలో అందజేశారు.పెబ్బేరు పట్టణ శివారులోని గుండుబావి కాడి ఇనాం భూములైన 6 గురు పేరిట ఉన్న 13.05 ఎకరాల భూములను వారి వారసులు 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. కాని వారికి దానిపై ఎలాంటి హక్కులు లేకపోవడంతో పెబ్బేరు మున్సిపల్? చైర్మన్ కరుణశ్రీ సాయినాథ్? మంచి మనసుతో ఆలోచించి ముందుగా ఆ భూమికి ఓ.ఆర్??.సి వచ్చేలా చూశారు. తరవాత వారికి ఆ భూములు సాగు చేసుకుంటున్నందుకు దాదాపు 111 మందిలో 42 మందికి గురువారం పట్టా పాసు బుక్కులు పంపిణీ చేశారు.మిగతా 69 మందికి కూడా త్వరలోనే వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రైతులు మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ దంపతులకు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

# బ్రతికి ఉండగానే భార్య యొక్క విలువను గుర్తించండి...



**(సి కే న్యూస్)**ఒక సహోదరుడు తనతో జీవిత విలువల గురించి మాట్లాడుతున్న క్రమములో తన అనుభవాన్ని ఇలా చెప్తూ వచ్చాడు. భార్య చనిపోయి ఇప్పటికీ నాలుగురోజులు గడిచిపోయాయి..తన అంత్యక్రియలకు వచ్చిన బంధువులు ఒక్కొక్కరుగా వెళ్ళిపోయారు.. చివరికి ఆ ఇంట్లో నేను, నా పిల్లలు మిగిలాము... తను నాతోపాటు లేదు అన్న విషయాన్ని జీర్ణించుకో లేకపోతున్నాను.. ప్రతి విషయానికి 'ఏమండీ.... అనే పిలుపుకు నేను దూరమయ్యాను.. నన్ను, నా పిల్లలను తన ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే తను ఇప్పుడు లేదు..

ఎప్పుడూ మమ్మల్ని అతిగా ప్రేమించే తను మమ్మల్ని వదిలి వెళ్ళిన సందర్భాలు లేవు.. ఒకవేళ పుట్టింటికి వెళ్ళినా కూడా మా గురించి ఆలోచించి సాయంత్రానికల్లా తిరిగి వచ్చేది... నిజానికి తను వెళ్ళడం నాకు ఇష్టం ఉండేది కాదు.. వంట మరియు ఇతర పనులు చేసుకోవాల్సి వస్తుందనే స్వార్థం నాలో ఉండేది.. సెలవు దినాలలో నేను మరియు పిల్లలు టివి చూస్తూ ఆనందిస్తుంటే, తను మాత్రం వంటింట్లో వంట చేయడంలో బిజీగా ఉండేది.. ఎప్పుడైనా మాతో పాటు టివి చూడటానికి కూర్చుంటే 'అమ్మా... నీళ్లు, 'అమ్మా... తినడానికి ఏమైనా తీసుకురా.., 'కొంచెం కాఫీ పెట్టవోయ్ అంటూ .. తనని మళ్లీ వంటింట్లోకి పంపించేవాళ్ళం...
నేను అడగకుండానే అర్థం చేసుకుని నా అన్ని పనులు చేసి పెట్టేది.. ఇప్పుడు ఒక గ్లాస్ మంచినీళ్లకు మరియు కప్పు కాఫీ చేసుకోవడానికి తను జతగా లేదన్న చేదు నిజాన్ని మరవలేకపోతున్నాను.. తన ఇష్టాలను సహితం నేను గుర్తించలేకపోయాను.. సినిమాలకు గానీ షికారులకు గానీ తీసుకువెళ్ళలేకపోయాను.. తను కూడా ఎప్పుడూ అడిగింది లేదు.. ఆఫీసు నుండి లేటు వచ్చినపుడు 'ఎందుకు లేటయ్యింది' అనే తన ప్రశ్నకు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పేవాడిని..

ఏమండీ... పాలవాడికి డబ్బులు.., పేపర్ వాడికి డబ్బులు.., కరెంట్ బిల్లు.., పిల్లల ఫీజులు కట్టే విషయం మరీ మరీ గుర్తుచేసేది.. చివరకు "నాకు సంబంధించిన బిపి మాత్రలు, షుగర్ మాత్రలు కూడా అయిపోకముందే తెచ్చుకొండని మరీ మరీ గుర్తుచేసేది." ఇప్పుడు అవన్నీ గుర్తుచేయడానికి తనులేదు.. తన గురించి ఎప్పుడూ, ఏది కావాలని నోరు తెరచి అడిగింది లేదు.. రాత్రి పని అంతా ముగించుకుని నా పక్కన పడుకున్నప్పుడు.. ఏమండీ... ఎదలో నొప్పిగా ఉంది.. నడుము నొప్పిగా ఉంది.., కాళ్ళు నొప్పిగా ఉన్నాయి అన్నప్పుడు అవన్నీ పని అలసట వల్ల అని చెప్పి అటు తిరిగి పడుకునేవాడిని..

చివరికీ ఆ ఎద నొప్పి హార్ట్‌బిఎటాక్ రూపంలో వచ్చి తనను తీసుకు వెళ్లేవరకు నేను గుర్తించలేకపోయాను.. ఇంట్లో అంతా కొత్త.. వంటింట్లో ఏది ఎక్కడ ఉందో తెలియని పరిస్తితి.. ఉదయం నుండి తిన్న ప్లేట్లు, పాత్రలు అన్నీ సింక్ నిండా అలాగే పడిఉన్నాయి..
పిల్లలు ఏది పట్టనట్లు తమ తమ మొబైల్స్ తో బిజీగా గడుపుతున్నారు.. తను ఉన్నన్నీ రోజులు అన్ని సులభంగా అయ్యే పనులు.., ఇప్పుడు మాకు భారంగా అనిపిస్తున్నాయి..

పిల్లలు తమకు కావాల్సిన నూడుల్స్ తిని ఖాళీ పాకెట్స్ కూడా సింక్ లో పడేసారు.. అన్ని పాత్రలు కడిగేసి.. ఫ్రిడ్జ్ లో ఉన్న ఆపిల్ పండు తినేసి పడుకుందామని భారంగా బెడ్రూం వైపు నడిచాను..లైట్ ఆఫ్ చేసి పడుకుందామనేలోపు గోడ మీద తన చిత్రాన్ని చూసి తెలియకుండానే కళ్ళలో నీళ్లు వచ్చాయి.. తనను నిర్లక్ష్యము చేయకుంటే నేను, నా పిల్లలు ఇంకొన్ని రోజులు సంతోషంగా ఉండేవాళ్ళం అని తలచుకుంటూ భారంగా కళ్ళుమూసాను...
"బ్రతికి ఉండగానే భార్య యొక్క విలువను గుర్తించండి."
సేకరణ %ఎ% డా పీటర్ నాయక్ లకవత్



ది సిజ్లింగ్ సిస్టర్ ద్వయం: నేహా మరియు ఐషా శర్మ చిత్రాలలో మెరుస్తున్నారు

# స్టన్నింగ్ సామ్.. సిట్టింగ్ పోజులో పైటను పక్కకు జరిపి




స్టార్ హీరోయిన్ సమంత.. ప్రస్తుతం సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చి రెస్ట్ మోడల్ ఉంటున్న సంగతి తెలిసిందే. ఆ మధ్య వెకేషన్ ట్రిప్‌లు అంటూ ఫుల్ ఎంజాయ్ చేసిన ఈ భామ.. సోషల్ మీడియాలోనూ వాటిని షేర్ చేస్తూ ఫ్యాన్స్‌కు టచ్‌లోనే ఉంది. మధ్య మధ్యలో ఫొటోషూట్స్ కూడా చేస్తూ అభిమానులను అలరించింది. తాజాగా మరోసారి పైట పక్కకు జరిపి పింక్ కలర్ శారీలో సిట్టింగ్ పోజు ఇచ్చి ఆకట్టుకుంది. వివరాల్లోకి వెళితే.. చూపు తిప్పుకోకుండా చేసే అందం, మైమరపించే నటనతో దాదాపు పదిహేనేళ్లుగా టాలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా హవాను కొనసాగిస్తూ దూసుకుపోతోంది టాలెంటెడ్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు. గతంలో కన్నా ఆ మధ్య పుష్పతో తన స్టార్ డమ్‌ను మరింతగా పెంచుకున్న ఈ ముద్దుగుమ్మ.. వరుస పెట్టి సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేసుకుంటూ ముందుకు వెళ్తోంది. అయితే రీసెంట్‌గా మయోసైటిక్ ట్రీట్‌మెంట్ సహా కాస్త ప్రశాంతంగా ఉండేందుకు సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. అయినా సోషల్ మీడియాలో యమ రచ్చ చేస్తూనే ఉంది. ఇందులో భాగంగానే తన పర్సనల్ విషయాలతో పాటు హాట్ ఫొటోషూట్స్?ను పోస్ట్? చేస్తూ ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. అయితే ఈ మూడు నాలుగు రోజుల నుంచి వరుసగా చీరలో అందాలను ఆరబోస్తూ రోజుకో ఫొటోను పోస్ట్ చేస్తోంది. తాజాగా పింక్ కలర్? శారీలో అదిరిపోయే పిక్?ను షేర్ చేసింది. బ్యాక్? గ్రౌండ్ కలర్ కూడా మ్యాచింగ్ అయ్యేలా పింక్? వరల్డ్?లో కనువిందు చేసింది. సిట్టింగ్? పోజులో పైటను పక్కకు జరిపి ఎద అందాలను ఎక్స్?పోజ్? చేసింది. కాస్త స్మైలింగ్ కూడా ఇచ్చింది. ఈ ఫొటోకు ఓ వేదాంతం కూడా రాసుకొచ్చింది. "సుతిమెత్తనైన ఈ చక్కటి ఎంబ్రాయడరీ కలిగి ఉన్న పింక్ కలర్?? చీర.. మీరు కలలు కనే ధైర్యాన్ని, దాన్ని సాకారం చేసుకునే అవకాశమున్న మాయాలోకానికి మార్గం చూపుతోంది. ఆకర్షితమైన ఈ మాస్టర్ పీస్ అందాలకు దాసోహమయ్యేందుకు సిద్ధంగా ఉండంది. ఎందుకంటే ఈ చక్కటి కలల ప్రపంచంలో నక్షత్రాల వెలుతురు నడుమ మీ హృదయం ఆకాశంలో తేలిపోతుంది" అని రాసుకొచ్చింది.



సాయి మంజ్రేకర్ తాజా స్పైసీ చిత్రాలు అప్రయత్నంగా స్పాట్‌లైట్‌ను దొంగిలించాయి

# తెలుగు సినిమాలపై ఆసక్తి చూపించని భామ..!



మలయాళ భామ మాళవిక మోహనన్ తెలుగు సినిమాల మీద ఆసక్తి చూపించట్లేదా అంటే అవుననే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. మలయాళంలో కెరీర్ మొదలు పెట్టి తమిళ, కన్నడ సినిమాల్లో చేస్తున్న ఈ అమ్మడు తెలుగులో మొదటి అవకాశం ప్రభాస్ మూవీ అందుకుంది. మారుతి డైరెక్షన్ లో వస్తున్న ఈ ప్రాజెక్ట్ లో మాళవిక మోహనన్ కూడా స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది. అయితే తెలుగులో డైరెక్ట్ గా సినిమాలు చేయకపోయినా ఆమె నటించిన సినిమాలు డబ్ అయ్యి తెలుగులో రిలీజ్ అయ్యాయి. అలా తెలుగు ఆడియన్స్ కు దగ్గరైంది మాళవిక. ప్రభాస్ సినిమాతో పాటు కోలీవుడ్ లో విక్రం హీరోగా వస్తున్న తంగలాన్ సినిమాలో కూడా అమ్మడు నటిస్తుంది. రీసెంట్ గా రిలీజైన తంగలాన్ టీజర్ లో మాళవిక లుక్ చూసి ఆమె ఫ్యాన్స్ షాక్ అయ్యారు. ఫోటో షూట్ లో తన గ్లామర్ తో మెప్పిస్తూ వచ్చిన మాళవిక తంగలాన్ లో డీ గ్లామర్ రోల్ లో సర్ ప్రైజ్ చేస్తుంది. ప్రభాస్ సినిమాలో నటిస్తుందని తెలిసి టాలీవుడ్ దర్శక నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇస్తా అంటున్నా మాళవిక మాత్రం నో అనేస్తుందట. ప్రభాస్ సినిమా రిలీజ్ అయ్యాక చేస్తా అని కొందరికి చెబుతుంటే.. రెమ్యునరేషన్ ఎక్కువ డిమాండ్ చేస్తుందని టాక్. తెలుగులో పాన్ ఇండియా సినిమాల మీద అమ్మడి ఫోకస్ ఉందని తెలుస్తుంది. అందుకే మాళవిక మరో తెలుగు సినిమాకు సైన్ చేయలేదు. ప్రభాస్ సినిమా రిలీజ్ అయ్యాకే నెక్ట్స్ తెలుగు సినిమా చేయాలి అప్పుడైతేనే తన రేంజ్ కి తగిన ఛాన్స్ వస్తుందని భావిస్తుంది మాళవిక. సినిమాలు ఎలా ఉన్నా అమ్మడు ఫోటో షూట్స్ మాత్రం నెక్ట్స్ లెవెల్ లో ఉంటున్నాయి. సౌత్ లో సోషల్ మీడియా ఫాలోయింగ్ లో అదరగొట్టే భామల్లో మాళవిక మోహనన్ ఒకరు. అయితే ఫోటో షూట్స్ మాత్రమే కాదు సినిమాలతో కూడా తన సత్తా చాటాలని కోరుతున్నారు ఆమె ఫాలోవర్స్. మిగతా భామలంతా కూడా తెలుగులో ఛాన్స్ లు వస్తే బాగుంటుందని కోరుతుంటే మాళవిక మాత్రం ఇక్కడ దర్శక నిర్మాతలు ఆమె వెంట పడుతున్నా సరే కాదని చెప్పేస్తుంది. ప్రభాస్ సినిమా మీదే తన ఆశలన్నీ పెట్టుకున్న మాళవిక ఆ సినిమాతో తన కెరీర్ గ్రాఫ్ పెంచుకుంటుందా లేదా అన్నది చూడాలి. స్టార్ హీరోయిన్ మెటీరియల్ అయినా అమ్మడు వచ్చిన అవకాశాలను కాదని చెప్పడం వల్లే రేసులో మాళవిక వెనుకబడి ఉందని చెప్పుకుంటున్నారు.